J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 36 11.2.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## కాంగ్రెస్‌ను కెలకబోయి.. గాడి తప్పిన మోడీ వ్యాఖ్యలతో

# కమలంలో కలవరం

- విభజనపై ప్రధాని రేపిన వివాదం
- తెలంగాణలో ఊపందుకున్న సెంటిమెంటు నినాదం

*చినజీయర్ స్వామి నభూతో...న భవిష్యత్ అన్నట్టుగా ఏర్పాటు చేసిన శ్రీ రామానుజుల స్మారకాన్ని ప్రారంభించడమే కాకుండా దాదాపు నాలుగు గంటలు ఓపిగ్గా అక్కడే గడపడం ద్వారా ప్రధాని మోడీ గొప్ప మైలేజ్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఈ పర్యటన తెలంగాణ బీజేపీకి రాజకీయంగా బాగా ఉపకరిస్తుందని తెలంగాణ బీజేపీ నేతలు సంబరపడ్డారు. కానీ, అంతలోనే వారి ఆశలన్నీ ఆవిరై పోయాయి. రాజ్యసభ వేదికగా కాంగ్రెస్‌ను టార్గెట్ చేసుకుని రాష్ట్ర విభజనపై మోడీ చేసిన విమర్శలతో తెలంగాణలో కమలం కాస్తా కారు కింద పడిపోయిందన్న మాట జోరుగా వినపడుతోంది.*

కాంగ్రెస్‌పార్టీని తూర్పారబట్టే 'మహా క్రతువు'లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, తెలంగాణ విషయంలో 'సెల్ఫ్ గోల్' వేసుకున్నారా ...? అన్న అనుమానాలను రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ తెలంగాణ-ఆంధ్ర విభజనను అస్తవ్యస్తంగా చేసింది. పార్లమెంట్ తలుపులు మూసి, మైకులు కట్‌చేసి, చర్చ లేకుండా బిల్లు ఆమోదించారు. కొందరు సభ్యులు సభలో పెప్పర్ కూడా స్ప్రే చేశారు. కాంగ్రెస్ స్వార్థం వల్లే, రెండు రాష్ట్రాలూ ఇప్పటికీ కష్టాలు పడుతున్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ గెలవలేదు. అదే బీజేపీ హయాంలో మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేశాం..." అంటూ నరేంద్ర మోదీ కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు.

నిజానికి ఆయన చెప్పింది అక్షర సత్యం. కానీ, తెలంగాణలో బీజేపీ దూకుడును ఎదుర్కొంటున్న టీఆర్ఎస్‌కు ఇది బీజేపీపై ఎదురు దాడికి అందివచ్చిన గొప్ప అవకాశంగా కనిపించింది. వెంటనే నిరసనలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ప్రకటనలు, బీజేపీపై దుమ్మెత్తి పోయడాలు మొదలైపోయాయి.

మోదీ కాంగ్రెస్‌పై చేసిన విమర్శలు టీఆర్ఎస్‌కు ఇంతగా 10లో

## ఉవ్వెత్తున ఎగసి.. సమసిన ఉద్యోగ ఉద్యమం

# తగ్గిందెవరు.. నెగ్గిందెవరు?

*'చలో విజయవాడ' కార్యక్రమంతో ఉవ్వెత్తున ఎగసిన అగ్నిజ్వాలలా మారిన ఉద్యోగ ఉద్యమం, ఆ తరువాత ఒక్క సమావేశంతో సమసిపోయింది. నిప్పుకుండపై నీళ్ళు చల్లినట్లుగా చల్లబడిపోయింది. ఈ పరిణామం ఇటు ప్రభుత్వానికి అటు ఉద్యోగస్తులకు ఇద్దరికీ మంచిదే. ఉభయ మధ్యస్థంగా జరిగిన ఆ చర్చలలో నెగ్గిందెవరు...? తగ్గిందెవరు..?? లాభపడిందెవరు..? నష్టపోయిందెవరు..?? ఇదే ఇప్పుడు వినపడుతున్న ప్రశ్న. సహజంగా ఇలాంటి ఉద్యమాలు జరిగినప్పుడు ప్రభుత్వ పెద్దలైనా, ఉద్యోగ నేతలైనా తెగేదాకా లాగరు. అది ఇద్దరికీ నష్టమే. తాజా ఆందోళనలో కూడా అదే జరిగింది. 'తగ్గేదే లే' అని భీష్మించుకు కూర్చున్న ఇరు వర్గాలూ ఇక్కడ తగ్గాయన్నది తోసిపుచ్చలేని నిజం.*

### గోరంతను కొండంత చేశారు...!

గతంలో కూడా అనేక పర్యాయాలు ప్రభుత్వ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇవ్వడం, ఆ తరువాత ప్రభుత్వంతో చర్చలు జరిపి సామరస్యంగా పరిష్కరింపచేసుకోవడం వంటి సంఘటనలు చాలానే జరిగాయి. అయితే అప్పటి ప్రభుత్వాలలో, ఉద్యోగ సంఘాలు నేరుగా ముఖ్యమంత్రితోనే సంప్రదింపులు జరిపి విషయానికి ఫుల్‌స్టాప్ పెట్టేవి. ఈసారి ఆలా జరగలేదు. ముఖ్యమంత్రికీ ఉద్యోగ సంఘాలకి మధ్యలో సలహాదారులూ, మంత్రులూ, అధికారులూ వారధులుగా వ్యవహరించారు. ఉద్యోగుల మొండిపట్టుకి రెండింతలుగా మధ్యవర్తులు మంకుపట్టు పట్టారు. అరెస్టులు చేస్తా మన్నారు, సస్పెన్షన్, టెర్మినేషన్, ఎస్మా వంటి శక్తివంతమైన పదాలు వాడారు. గోరంత సమస్యను కొండంత చేశారు. జగన్మోహన్ రెడ్డిపై వీరాభిమానం ఉన్న ఒక వర్గం సామాజిక మాధ్యమాలలో ఉద్యోగులను అవినీతిపరులుగా, 10లో




## పిఎస్ఎల్‌వి-సి52

# ప్రయోగానికి రెడీ

### 14న ముహూర్తం

*కోవిడ్ నేపథ్యంలో ఇటీవల కొంత జాప్యం తర్వాత షార్ మళ్ళీ హుషారుగా రాకెట్ ప్రయోగాలకు సిద్ధమవుతోంది. శ్రీహరి కోట సతీశ్‌ధవన్ స్పేస్‌సెంటర్ (షార్) నుంచి ఈ ఏడాది మొట్టమొదటి రాకెట్‌గా పిఎస్ఎల్‌వి-సి52 ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ కొత్త ఛైర్మెన్‌గా ఎస్.సోమనాథ్ సారథ్యంలో ఇది తొలి రాకెట్ ప్రయోగం కానుండడం విశేషం.* 12లో

శ్రీ సాయి
కంచి

రోడ్ నెం.2, 2వ మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు. సెల్ : 8919714848.

# తీగ లాగితే.. డొంకంతా కదిలింది

## అక్రమవసూళ్ళ వ్యవహారంలో.. సెబ్ ఇన్‌స్పెక్టర్‌పై వేటు

*తీగ లాగితే డొంకంతా కదిలిందన్న సామెతగా అక్రమవసూళ్ల దందాలో ఓ సెబ్ ఇన్స్‌పెక్టర్ కూడా ఉన్నట్లు తేలడంతో ఉన్నతాధికారులు అవాక్కయ్యారు. ఏసిబి అధికారులు రంగంలోకి దిగి ఒకటొకటిగా ఆ అక్రమాలను బయటపెడుతుండడంతో సెబ్ సిబ్బంది గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తే అందులోని కొందరు సిబ్బందే ఇదే అక్రమాలకు పాల్పడుతుండడంతో సెబ్ ప్రతిష్ట దిగజారిపోతోంది. జిల్లాలో సెబ్ ఉన్నతాధికారులు ఎంతో పట్టుదలతో ఇటీవలికాలంలో ఎన్నో అక్రమాలను వెలికితీశారు. ఇసుక, మద్యం, గుట్కా, ఎర్రచందనం, గంజాయి తదితర అక్రమరవాణాలను అరికట్టేందుకు రేయింబవళ్ళు వాళ్ళు పనిచేస్తున్నారు. కానీ కొంతమంది అవినీతి సిబ్బంది మాత్రం ధనాశతో అనేకమంది వద్ద అక్రమంగా డబ్బులు గుంజుతుండడం వల్ల సెబ్‌కే చెడ్డపేరు వస్తోంది. అలాంటి చీడపురుగులను ఏరివేస్తే తప్ప ఆ శాఖ ప్రతిష్ట పెరగదు.*

నాయుడుపేటలో సెబ్ కానిస్టేబుళ్ళు అక్రమవసూళ్ళకు పాల్పడిన సంఘటనలో అక్కడి సెబ్ ఇన్స్‌పెక్టర్ టి.అరుణకుమారికి సంబంధం ఉన్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలడంతో ఆమెను ఇటీవల సెబ్ కమిషనర్ వినీత్‌బ్రిజ్‌లాల్ సస్పెండ్ చేశారు. దీంతో సెబ్ సిబ్బందిలో వణుకు ప్రారంభమైంది. ఎప్పుడు ఎవరిపై ఎలాంటి వేటుపడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. నాయుడుపేటలో ఓ కూల్‌డ్రింక్ షాప్ నిర్వహించే ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద లంచం తీసుకుంటున్న ఓ కానిస్టేబుల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, అందుకు ప్రోత్సహించిన హెడ్‌కానిస్టేబుల్‌ను కూడా ఇటీవల ఏసిబి అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏసిబి అధికారులు ఆ తర్వాత కూడా నాయుడుపేట పరిధిలో సెబ్ సిబ్బంది ఎక్కడెక్కడ ఎంతెంత అక్రమవసూళ్ళకు పాల్పడ్డారోననే విషయమై ముమ్మరంగా విచారణ చేపట్టారు. నాయుడుపేట, ఓజిలి మండలాల్లో ప్రభుత్వ మద్యం షాపులకు దగ్గరలో ఉన్న కూల్‌డ్రింక్ షాపుల నుంచి సెబ్ సిబ్బంది అక్రమంగా ముడుపులు గుంజుతున్నట్లు తేలడం, ఈ అక్రమాల్లో ముఖ్యంగా ఇన్స్‌పెక్టర్ అరుణకుమారిది కీలకపాత్రగా ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో కమిషనర్ ఆమెపై సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. సెబ్ సిబ్బంది కేవలం కూల్‌డ్రింక్ షాపుల్లోనే కాకుండా ఇసుక, గుట్కా అక్రమ రవాణాలకు సంబంధించి కూడా పెద్దఎత్తున అక్రమవసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఏసిబి అధికారులు ఈ సందర్భంగా గుర్తించారు. ఏసిబి డిఎస్పీ మోహన్‌తో పాటు, ఇన్స్‌పెక్టర్లు వేణు, శ్రీనివాస్, రమేష్, శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలసి నాయుడుపేట కార్యాలయంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. నాయుడుపేట సర్కిల్ పరిధిలో అక్రమ వసూళ్ళకు చెందిన చిట్టాను ఏసిబి అధికారులు కానిస్టేబుల్ నుంచి స్వాధీనం చేసుకుని, ఎవరెవరు ఎక్కడెక్కడ ఎంతెంత వసూలుకు పాల్పడుతున్నారో ఆరా తీశారు. ఏయే కూల్‌డ్రింక్ షాపు నుంచి ఎంతెంత డబ్బును అక్రమంగా రాబట్టుకుంటున్నారో గుర్తించారు. దీంతో జిల్లావ్యాప్తంగా కూడా సెబ్‌లో ఉన్న సిబ్బంది పనితీరును నిఘాకన్నుతో ప్రత్యేకంగా పరిశీలించి అవినీతిపరులను ఏరివేయాలని ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# జెన్‌కో ప్రైవేటీకరణ ప్రయత్నాలు దారుణం

## సిపిఎం నాయకుల విమర్శ



ప్రచారజాతా నిర్వహిస్తున్న సిపిఎం - సిఐటియు నాయకులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ, దామోదరం సంజీవయ్య ఏపి జెన్‌కో థర్మల్ విద్యుత్ థర్మల్‌కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు ప్రయత్నాలు చేస్తుండడం దారుణమని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈనెల 6న ముత్తుకూరు మండలంలోని మామిడిపూడి గ్రామంలో సిపిఎం అనుబంధ సంస్థ సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారజాతా నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ యత్నాలను మానుకోవాలన్నారు. జెన్కో థర్మల్ కేంద్రాన్ని పరిరక్షించుకోవాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఎం నాయకుడు చంద్ర రాజగోపాల్, సిపిఎం, సిఐటియు నాయకులు రాధయ్య, శ్రీనివాసులు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెన్నానదిలో ఈతకు దిగి.. మృత్యువాత


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

సరదాగా పెన్నానదిలో ఈతకొట్టాలని స్నేహితులతో కలసి నీళ్ళలోకి దిగిన ఓ బాలుడు ప్రమాదవశాత్తూ మునిగిపోయి దుర్మరణం పాలయ్యాడు. నెల్లూరులోని కిసాన్‌నగర్ సింహపురి కాలనీ దగ్గర పెన్నానదిలో ఈనెల 6న ఈ దుర్ఘటన జరిగింది. స్థానికుల కథనం మేరకు నగరంలోని డైకస్‌రోడ్డు సెంటర్‌లో నివసిస్తున్న షేక్ జాకీర్‌హుస్సేన్ పెద్దకొడుకు, నాల్గవ తరగతి చదువుతున్న ముజాఫర్(10) తన ఇద్దరు స్నేహితులతో కలసి పెన్నా నది వద్దకు వెళ్ళారు. నీళ్ళలోకి దిగిన ముజాఫర్ మునిగిపోవడంతో స్నేహితులు ఆందోళన చెందుతూ కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ బి.రమేష్‌బాబు సంఘటనాస్థలికి చేరుకుని స్థానికుల సాయంతో నదిలో గాలింపు చేపట్టి ముజాఫర్ మృతదేహాన్ని వెలికితీశారు. కేసు దర్యాప్తులో ఉంది.



# తాళమ్మతల్లికి విశేష పూజలు

గూడూరు సమీపంలో కొలువైవున్న తాళమ్మ అమ్మవారికి ఈనెల 6న ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారిని పూలమాలికలతో శోభాయమానంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తాళమ్మ తల్లికి పొంగళ్ళు పెట్టి నైవేద్యంగా సమర్పించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చెంచయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## వైద్యసిబ్బంది లేక..

# అల్లూరు ఆసుపత్రిలో అవస్త



## భర్తీచేయాలని కోరిన బిజెపి నాయకులు

మండల కేంద్రమైన అల్లూరులోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యసిబ్బంది కొరత వల్ల రోగులకు ఎంతో అవస్తగా ఉందని, వెంటనే ఈ ఆసుపత్రిలో వైద్యసిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు నెల్లూరులోని డిసిహెచ్ వైద్యురాలు డాక్టర్ ప్రభావతికి ఈనెల 7న అందజేసిన వినతిపత్రంలో కోరారు. ఈ ఆసుపత్రిని 50 పడకల స్థాయి నుంచి 100 పడకలకు మార్చి నిర్మాణాలు చేస్తున్నారని, అయితే ఆసుపత్రిలో మాత్రం ఒకే డాక్టర్ ఉన్నారని, వైద్యసిబ్బంది తగినంతమంది లేరని, అదే విధంగా వైద్యులు రాత్రివేళల్లో కూడా రోగులకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బిజెపి అల్లూరు మండలాధ్యక్షుడు శ్రీనివాసులు యశ్వంత్ సింగ్, కృష్ణమోహన్, బి.శ్రీనివాసులు, వాసు, రాంకుమార్, మధురెడ్డి, గోవిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్‌టిఏ నూతన కార్యవర్గం

ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జిఎస్‌టిఏ) ఈనెల 7న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. నెల్లూరు డికెడబ్ల్యు కాలేజీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షునిగా వెంకటగిరి విశ్వోదయ ప్రభుత్వ కళాశాలకు చెందిన యు.నరసింహులు, కార్యదర్శిగా నెల్లూరు డికెడబ్ల్యు కాలేజీకి చెందిన ఎం.వెంకటరావును ఎన్నుకున్నారు. కోశాధికారిగా బి.సతీష్, మహిళా అధ్యాపక ప్రతినిధిగా ఇ.కన్యాకుమారి, వర్సిటీ సెక్రటరీగా ఈశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ అధ్యాపకుడు ఏవి రమణారావు వ్యవహరించారు.

## జగన్ అవినీతికి...

# అడ్డూ అదుపూ ఉండడం లేదు

## -మాజీమంత్రి సోమిరెడ్డి విమర్శ




రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ అవినీతికి అడ్డూ అదుపూ ఉండడం లేదని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ఈనెల 7న ఆయన కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. మద్యం, ఇసుక విధానాల్లోనూ అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయని, సిఎం రాష్ట్రస్థాయిలో దోచుకుంటుంటే ఎమ్మెల్యేలు స్థానికంగా దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే ఫోన్‌లో సంప్రదిస్తే తప్ప కావలి సబ్‌రిజిస్ట్రార్ ఏపనీ చేయడం లేదని, జనం సొంత ఆస్తులు అమ్ముకునేందుకు, కొనేందుకు కూడా ఎమ్మెల్యే అనుమతి కావాలా?.. అని ప్రశ్నించారు. పోలీసులు కూడా వివక్షతో వ్యవహరిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి అంతా ఆగిపోయిందని, రైతులకు ఉపయోగపడే సూక్ష్మ సేద్య, యాంత్రీకరణ రాయితీలు వైకాపా ప్రభుత్వంలో అటకెక్కిపోయాయని ఆవేదన చెందారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, బీద రవిచంద్ర, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుతో పాటు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, దామచర్ల సత్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జేసిఐ కొత్త కార్యవర్గం


జేసిఐకి ఎంపికైన కొత్త కార్యవర్గసభ్యులు

నెల్లూరులోని పప్పుల వీధిలో ఉన్న జేసిస్ భవన్‌లో ఈనెల 6న నగర జేసిఐ 42వ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేసిఐ నెల్లూరుటౌన్ ప్రెసిడెంట్‌గా శింగంశెట్టి అభిషేక్, కార్యదర్శిగా కిషన్, కోశాధికారిగా హరిశంకర్ ప్రమాణస్వీకారం చేశారు. జేసిఐ మహిళాక్లబ్ రెండవ ప్రెసిడెంట్‌గా జ్వాలారెడ్డి, సెక్రటరీగా రమ్య, ట్రెజరర్‌గా జ్ఞానప్రసూన ఎంపికయ్యారు. జోన్ ప్రెసిడెంట్ అనిరుథ్, మాజీ ప్రెసిడెంట్ జ్యోతి శ్రీధర్, ప్రెసిడెంట్ శివ సాయికుమార్, డైరెక్టర్ సాయి, ప్రాజెక్టు మేనేజర్ మల్లికార్జున, జేసిస్‌భవన్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఎంపికైనవారంతా సమాజానికి ఉత్తమసేవలందించాలని నిర్వాహకులు కోరారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభచూపిన వారికి అవార్డులను అందజేశారు.

# వీధిబాలలను సంరక్షించాలి


మాట్లాడుతున్న కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి

వీధిబాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, ఎక్కడైనా వీధిబాలలు భిక్షాటనచేస్తూ కనిపిస్తే వారిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ఆయన కోవూరులోని తమ కార్యాలయంలో వీధి బాలల సంరక్షణ విషయమై సమావేశం నిర్వహించారు. బడి బయట పిల్లలు ఉండకూడదని, వారందరూ చదువుకోవాలని, అందుకు ప్రభుత్వం అన్నివిధాలా చేయూత అందిస్తుందని చెప్పారు. ఐసిడిఎస్ అధికారులు సమత, శ్రీనివాసరావు, పావనికుమారి, శ్రీలక్ష్మి, రత్నం, జాషువా తదితరులు ఈ కార్యక్రమలో పాల్గొన్నారు.

# ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీచేయాలి

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.35 లక్షల ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుగుయువత, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 7న నెల్లూరులోని సిఐటియు కార్యాలయంలో తెలుగుయువత నాయకుడు తిరుమలనాయుడు, డిఐఎఫ్ఐ నాయకుడు ఎంవి రమణ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. గ్రూప్ 1, 2, 3 పోస్టుల సంఖ్యను పెంచాలని, 6500 ఎస్ఐ, కానిస్టేబుళ్ళ పోస్టులను, 25వేల టీచర్ల పోస్టులను భర్తీచేయాలని వారు కోరారు. డివైఎఫ్ఐ నాయకులు ప్రసాద్, నరసింహా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సనత్, తేజ, ఏఐఎస్ఎఫ్ నాయకులు మస్తాన్ ఫయాజ్, సమంత్ పాల్గొన్నారు.

### కోవూరు నియోజకవర్గంలో...

# కోటి 36 లక్షలతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే ప్రసన్నతో కలసి ప్రారంభించిన కలెక్టర్



కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఈనెల 9వ తేదిన సుమారు కోటి 36 లక్షలతో వివిధ అభివృద్ధిపనులకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ప్రారంభించారు. కాళయకాగొల్లు, పెనుబల్లి, మినగల్లు గ్రామాల్లో గ్రామ సచివాలయాలను, మినగల్లులో రెండు ప్రాథమిక పాఠశాలలను వారు ప్రారంభించారు. పెనుబల్లి గ్రామంలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మినగల్లు సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి, వార్డుస్థాయిల్లోనే ప్రజా సమస్యలు పరిష్కరించాలనే ధ్యేయంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయాల వ్యవస్థతో బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాకారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు సచివాలయాల ద్వారా నేరుగా లబ్దిదారు లకు సకాలంలో అందుతున్నాయన్నారు. సచివాలయాల ద్వారా 27 సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలుచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. కోవూరు నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు కర్నూలు, తిరుపతి ఎంపీలు సంజీవకుమార్, గురుమూర్తిల ఎంపీ నిధులు చెరొక 10 లక్షల రూపాయల వంతున కేటాయించారంటూ ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. జేసీ గణేష్‌కుమార్, బుచ్చి నగర పంచాయతి ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, వీరి చలపతి, సూరా శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

### దేశ భద్రతకు భంగం కలిగిస్తే..

# అక్రిడిటేషన్ రద్దు

- పాత్రికేయులకు కేంద్రం కొత్తమార్గదర్శకాలు

దేశ భద్రతకు, సార్వభౌమత్వం, సమగ్రతలకు, ప్రజా జీవనంలో సుస్థిరతకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తే అలాంటి పాత్రికేయులకు అక్రిడిటేషన్ (ప్రభుత్వ గుర్తింపు) రద్దవుతుందంటూ కేంద్ర సమాచార ప్రసారశాఖ ఇటీవల విడుదల చేసిన సెంట్రల్ మీడియా అక్రిడిటేషన్ గైడ్‌లైన్-2022లో స్పష్టం చేసింది. అంతేకాదు, విదేశాలతో స్నేహసంబంధాలకు భంగం కలిగించేలా ప్రవర్తించినా, కోర్టుధిక్కారానికి పాల్పడినా, పరువు నష్టానికి, నేర కార్యకలాపాలను పురిగొల్పడానికి ప్రయత్నించినా పాత్రికేయుల అక్రిడిటేషన్ రద్దవుతుందని హెచ్చరించింది. ఈ మార్గదర్శకాలను ప్రెస్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో విడుదల చేసింది. పాత్రికేయులు బోగస్ వార్తలను ప్రచురించినా, పత్రాలను ఫోర్జరీ చేసి వార్తలుగా వెలువరించినా అక్రిడిటేషన్ నిలిపేస్తామని పేర్కొంది. ఈ మార్గదర్శకాలు ఆన్‌లైన్ వేదికలకు పనిచేసే జర్నలిస్టులకు కూడా వర్తిస్తాయని తెలిపింది. ప్రభుత్వ అక్రిడిటేషన్ పొందినట్లు పాత్రికేయులు తమ విజిటింగ్‌కార్డుల్లో, సామాజిక మాధ్యమాల ప్రొఫైల్స్‌లో, లెటర్‌హెడ్‌ల మీద ముద్రించకూడదని తెలియజేసింది. కనీసం ఏడాదికి పైగా నడుస్తున్న ఆన్‌లైన్ వార్తావేదికలు మాత్రమే అక్రిడిటేషన్‌కు దరఖాస్తు పెట్టుకోవడానికి అర్హులని, ప్రతినెలా సగటున ఆ వెబ్‌సైట్‌ను వీక్షిస్తున్న వారి సంఖ్యను సంబంధిత ఆడిటర్లు ధృవీకరించాలని, అలా గత 6 నెలల సమాచారాన్ని సమర్పించిన వెబ్‌సైట్‌ల దరఖాస్తులను మాత్రమే పరిశీలించనున్నట్లు ఆ కొత్త మార్గదర్శకాల్లో వివరించింది.

# వందకి తగ్గిన కరోనా

కరోనా కేసులు జిల్లాలో కొంచెం తగ్గుతున్నాయి. కొద్దిరోజుల కిందట వేలల్లో, మొన్నటిదాకా వందల్లో ఉన్న కేసులు ఇప్పుడు వందకి తగ్గాయి. ఈనెల 9 బుధవారం జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసులు 91 వచ్చాయి. 1681 మందికి పరీక్షలు చేయగా 91 మందికి పాజిటివ్ వచ్చిందని, యాక్టివ్ కేసులు 3478 ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా మొత్తం కరోనా కేసుల సంఖ్య1,63,952కు చేరింది. కోవిడ్ నుంచి కోలుకున్న 1194 మందిని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేయడంతో మొత్తం డిశ్చార్జి అయినవారి సంఖ్య 1,59,388కి చేరిందని, ఈ వ్యాధితో ఇప్పటిదాకా 1069 మంది మరణించారని వారు తెలిపారు.





### తమిళనాట ఉన్న లక్షలాదిమంది

# తెలుగోళ్ళు మీకు కనపడలేదా?

> సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రోజాలని ప్రశ్నించిన ఆచార్య సీఎంకే రెడ్డి



తెలుగునాట ఉన్న తమిళుల సంక్షేమం గురించి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్, నగరి శాసన సభ్యురాలు రోజాలు చర్చించడాన్ని ప్రముఖ వైద్యనిపుణులు, తమిళనాట తెలుగువారి తలైవర్, అఖిలభారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి స్వాగతించారు. అదే తరుణంలో తమిళనాట ఉన్న 2కోట్ల మంది తెలుగు వారు మీకు కనపడలేదా...? అంటూ కేసీఆర్, రోజాలను సీఎంకే రెడ్డి ప్రశ్నించారు. తమిళనాడులో ఉన్న తెలుగువారి హక్కులకోసం తాము దశాబ్దాలుగా పోరాటం సాగిస్తున్నామని ఈ సందర్భంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టాలిన్‌ను కలిసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆంధ్రలోని నగరి నియోజకవర్గ శాసనసభ్యురాలు రోజా ఇద్దరూ కేవలం తెలుగునాట ఉన్న తమిళుల గురించి మాత్రమే తమిళనాడు సీఎంతో చర్చించడం దారుణం అన్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల తరువాత అత్యధిక తెలుగువారున్న తమిళనాడులో తెలుగు ప్రజలు తెలుగుభాష, ఇతర అనేక హక్కుల కోసం ఏళ్ళ తరబడి పోరాటం సాగిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని... ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు ఇద్దరూ చొరవ తీసుకుని తమిళనాడులోని తెలుగువారి మనోభావాలను గుర్తించి వారి సమస్యలపై దృష్టిపెట్టాలని ముద్దుకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.



సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఈనెల 9న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను కలసి తమ నియోజకవర్గంలోని తడ, సూళ్ళూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్ళకూరు, ఓజిలి మండలాలకు 15వ ఆర్థికసంఘం నిధుల ద్వారా వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌లు, ప్రహరీగోడల నిర్మాణం కోసం 50 లక్షలు, సిపిడబ్ల్యుఎస్ స్కీం కోసం మరో 50 లక్షలకు సంబంధించి నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించారు.


## నివాళి



నిర్యాణము : 09.02.2022

మాకు ఆత్మీయులు, ఆప్తులు

కీర్తిశేషులు జే.వి.రెడ్డి గారి సతీమణి

**శ్రీమతి జక్కా జానకమ్మ గారి**

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ మా నివాళి.

## 'ప్రభా'తం

# కోయిల గానం.. అంతర్ధానం..



కోయిల గానం ఆగిపోయింది. భారతావనినే కాదు ప్రపంచాన్నే ఉర్రూతలూగించిన అద్భుత కంఠస్వరం మూగబోయింది. ఒకటా రెండా దాదాపు డెబ్బై ఏళ్ళ పాటు సంగీత ప్రపంచాన్ని తన మధురమైన గాత్రంతో ఓలలాడించిన భరతమాత ముద్దుబిడ్డ..లతా మంగేష్కర్.. ఇక సెలవంటూ ఏ గంధర్వలోకాలకో తరలివెళ్ళిపోయింది. భారతదేశానికే గర్వకారణమైన సంగీత శిఖరం ఒరిగిపోయింది. ఫిబ్రవరి 6వ తేదీ.. సంగీత ప్రపంచంలో, ముఖ్యంగా హిందీ సినీరంగంలో తీరని విషాదం నిండినరోజుగా మారింది. ఆమె అస్తమయంతో భారతావనిలో విషాదం అలముకుంది. భౌతికంగా ఆమె నిష్క్రమించినా..ఆ సుప్రశాంతమైన రూపం.. ఆ చిరునవ్వు.. అజరామరమైన ఆమె గానం.. అన్నీ భారతీయుల గుండెల్లో..చిరస్థాయిగా నిలిచే ఉంటాయి.

కోయిల గానం ఆగిపోయింది. భారతావనినే కాదు ప్రపంచాన్నే ఉర్రూతలూగించిన అద్భుత కంఠస్వరం అంతర్ధానమైంది. ఒకటా రెండా దాదాపు డెబ్బై ఏళ్ళపాటు సంగీత ప్రపంచాన్ని తన మధురమైన గాత్రంతో ఓలలాడించిన భరతమాత ముద్దుబిడ్డ..లతా మంగేష్కర్.. ఇక సెలవంటూ ఏ గంధర్వలోకాలకో తరలివెళ్ళిపోయింది. దేశానికే గర్వకారణమైన సంగీత శిఖరం ఒరిగిపోయింది. కరోనా రాకాసితో పాటు అనారోగ్య రక్కసి ఆమెను నిర్దాక్షిణ్యంగా పొట్టనబెట్టుకుని.. దేశప్రజలకు కంటనీరు తెప్పించాయి. 'నిదురపోరా తమ్ముడా'.. అంటూ తెలుగులో కూడా అద్వితీయంగా గానం చేసిన ఆ మహాగాయకురాలు 92 ఏళ్ళ వృద్ధాప్యంలో అస్వస్తతకు గురై ముంబైలో మృత్యుఒడిలోకి చేరి శాశ్వతంగా నిదురపోయారు.

ఫిబ్రవరి 6వ తేదీ.. సంగీత ప్రపంచంలో తీరని విషాదం నిండినరోజు. భారతీయ సినిమా రంగంలో, మరీ ముఖ్యంగా హిందీ సినిమా లోకానికి చీకటిరోజు. లతా మంగేష్కర్ భువిని వీడి దివికేగిన రోజు!.. మధురాతి మధురమైన ఆమె పాట కూడా ఆమెతో పాటు వెళ్లిపోయింది. ఇక ఆమె స్వరం నుంచి ఏ పాటైనా ఏ మాటైనా ఎలా వినగలం?.. అయినా ఆమెలా ఆర్తితో, ప్రేమతో.. దు:ఖంతో.. సంతోషంతో.. దైవభక్తితో.. దేశభక్తితో.. వైరాగ్యంతో.. ఏ భాషలోనైనా.. ఏ భావాన్నయినా అలవోకగా ఆర్ద్రంగా పాడగలవారు..ఆ పాటతో సంగీత ప్రపంచాన్నే రసగంగా ప్రవాహంలో పులకింపజేసి.. పరవశింపజేయగలవారు ఆమె కాక.. మనకింకెవరున్నారు?.. ప్రాంతాలను, దేశాలను, ఖండాలను దాటి.. అన్ని హద్దులనూ చెరిపేసి.. భారతావనికే కాక లోకానికంతటికీ మాధుర్యాన్ని పంచిన ఆ సంగీతసామ్రాజ్ఞి లేని లోటు ఇంకెవరు తీరుస్తారు?... పాటల పూల తేరుపై వచ్చి సమస్త అవనీతలానికంతటికీ సంగీత వసంతాన్ని తెచ్చి.. వసంతకోయిలలా తన గాన మాధుర్యాన్ని అందరికీ పంచిపెట్టిన లతమ్మ ఇక లేరనే బాధ అశేష జనవాహిని ఎదలోతుల్లో కలత పెడుతూనే ఉంది. పాటే ఆమెకు సర్వస్వం. పాటే శ్వాసగా.. ధ్యాసగా.. పాటే జీవితంగా.. జీవితమే పాటగా జీవించినంతకాలం జీవించారామె. యుగానికొక్కరు అన్నట్లుగా.. ఇక ఆమెలాంటి గాయనీమణులు మరెప్పుడు పుడతారో ఏమో!..తెలుగుభాషతో సహా 36 భాషల్లో దాదాపు 50 వేల పాటలు పాడడమంటే మాటలా?..ఆ ఘనకీర్తి ఒక్క లతా మంగేష్కర్‌కే దక్కింది. అందుకే ఆమె 'భారతరత్న'గా మెరిసింది.

1929 సెప్టెంబరు 28న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో దీనానాధ్ మంగేష్కర్-సుధామతి దంపతులకు జన్మించిన లతా మంగేష్కర్ చిన్నతనం నుంచే సంగీతంపై మక్కువ పెంచుకుని, సంగీతంలో తండ్రే తొలిగురువుగా ఎదిగింది. కృషి పట్టుదలతో సంగీత రంగంలో తనదైన ప్రతిభాపాటవాలతో రాణిస్తూ సినిమా రంగంలో అద్వితీయమైన గాయకురాలిగా గానప్రస్థానం ప్రారంభించింది. 'ఆయేగా ఆయేగా.. ఆయేగా.. ఆనేవాలా ఆయేగా' పాటలో ఆమె గళమాధుర్యానికి సంగీతప్రపంచం విస్తుపోయింది. ఆ పాట దేశాన్ని ఊపేసింది. 'ఏ మేరే వతన్ కే లోగో' అంటూ పాడితే జాతిమొత్తం స్ఫూర్తితో తేజరిల్లింది. 'మొఘల్ ఏ అజం' సినిమాలో 'ప్యార్ కియా తో డర్నా క్యా' అని ఆమె పాడితే దేశమంతా ఆ పాట మార్మోగిపోయింది. 'గాతా రహే మేరా దిల్' అని పాడితే ఆమె అభిమానుల సంఖ్య కోట్లను దాటింది. పాట ఏదైనా సరే..ఆమె స్వరంలోకి వెళ్తే అదొక మధురంగా మారిపోతుంది. అంతటి మహత్తు ఆమె గళంలో..ఆమె స్వరంలో ఉంది. ఆ స్వరం..భగవంతుడు ఆమెకిచ్చిన అద్భుత వరం!

మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన లతా మంగేష్కర్ జీవితంలో ఎన్నో కష్టనష్టాలను కూడా ఎదుర్కొంది. చిన్నవయసులోనే తండ్రి మరణించడంతో బాల్యమంతా కష్టాలు కన్నీళ్ళతోనే గడిచింది. అయిదుగురు కుమార్తెల్లో తానే పెద్దకూతురు కనుక కుటుంబాన్ని తానే కష్టపడి మోసింది. జీవితంలో ఒక్కొక్క మెట్టూ అధిగమిస్తూ.. ప్రతిభనే నమ్ముకుని అంచలంచెలుగా ఎదిగింది. 1947లో 'మజ్‌బూర్' చిత్రంతో హిందీ సినీరంగంలో గాయనిగా ప్రవేశించింది. 1960ల నాటికి ఆమె హిందీ సంగీతసామ్రాజ్ఞిగా రాణించింది. దాదాపు 170 మంది ప్రముఖ సంగీతదర్శకుల వద్ద ఆమె గానం చేసి తన గాన మాధుర్యంతో అశేష జనావళి అభిమానాన్ని పొందింది. కొన్ని సినిమాలను కూడా ఆమె నిర్మించారు. కష్టేఫలీ.. అన్నట్లుగా జీవితంలో నిరాశను జయించి, కష్టాలను ఓడించి విజయాలెన్నో సాధించారు. మహిళాలోకానికే మార్గదర్శిగా మారారు. ఆమెకు రాని పురస్కారాలు లేవు. సన్మానాలకు, అవార్డులకు లెక్కేలేదు. 'గాన కోకిల'గా, 'నైటింగేల్ ఆఫ్ ఇండియా'గా ప్రఖ్యాతిగాంచారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నారు. 1969లో దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన పద్మభూషణ్, 1989లో దాదాసాహెబ్‌ఫాల్కే పురస్కారం, 1999లో పద్మవిభూషణ్‌తో పాటు 2001లోఅత్యున్నతమైన 'భారతరత్న' కూడా అందుకున్న ధన్యజీవి ఆమె. రాజ్యసభలో ఎంపీగా కూడా కొంతకాలం పదవీబాధ్యతలు నిర్వర్తించారు. 2019 సెప్టెంబరు 28న ఆమె 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంలో కేంద్రప్రభుత్వం ఆ మహాగాయకురాలికి 'డాటర్ ఆఫ్ ది నేషన్' బిరుదును ఆమె పుట్టినరోజు కానుకగా అందజేసి శుభాకాంక్షలు చెప్పింది. ఏదేమైనా లతామంగేష్కర్ అస్తమయంతో భారతీయ సినీసంగీత ప్రపంచం విషాదపు చీకటిలో మునిగిపోయింది. భౌతికంగా ఆమె ఇప్పుడు లేకున్నా.. అవిగో తరతరాలకు తరగని పెన్నిధిగా ఆమె అందించిన వేలాది పాటలు మనందరి ముందున్నాయి. ఆమె పాటలు.. అందరి హృదయాల్లో మారుమ్రోగుతూనే ఉన్నాయి. ఆమె సుప్రశాంతమైన రూపం.. ఆ చిరునవ్వు.. అజరామరమైన అద్వితీయ గానం.. భారతీయుల గుండెల్లో.. చిరస్థాయిగా నిలిచే ఉంటాయి.

---

### గుర్రం జాషువా శిష్యుడు

# విద్వాన్ కిరణశ్రీ.. కన్నుమూత



ప్రఖ్యాత కవి, నవయుగ కవిచక్రవర్తి.. గుర్రం జాషువా శిష్యుడు, కవి, రచయిత విద్వాన్ కిరణశ్రీ (74) ఇక లేరు. ఎప్పుడూ ఎంతో హుషారుగా సాహితీ కార్యక్రమాలు నిర్వహించే ఆయన అనారోగ్యంతో ఇటీవల నెల్లూరులో చికిత్స పొందుతూ మరణించారు. దీంతో నెల్లూరుసీమ ఒక మంచి సాహితీవేత్తను కోల్పోయినట్లయింది.

నెల్లూరులోని కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డులో కిరణశ్రీ నివాసం ఉండేవారు. నగరంలోని సిపిఎం హైస్కూల్‌లో తెలుగు పండితునిగా పనిచేసి రిటైరైన ఆయన గుర్రం జాషువా చివరిరోజుల్లో అనారోగ్యంతో ఉన్నప్పుడు ఆయన ఇంటికి వెళ్ళి శుశ్రూషలు చేశారు. జాషువా అంటే ప్రాణంగా అభిమానించే కిరణశ్రీ సుదీర్ఘ కాలం పోరాటం చేసి నెల్లూరులో కస్తూర్బా కళాక్షేత్రంలో జాషువా విగ్రహస్థాపనకు కృషిచేశారు. ప్రభుత్వాన్ని ఒప్పించి నెల్లూరులో జాషువా గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేయించారు. దాదాపు రెండు దశాబ్దాలుగా జాషువా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఆయన ప్రతిఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తుండేవారు. మొక్కుబడిగా కాక జాషువాపై ఎంతో అభిమానంతో, ఎంతో చిత్తశుద్ధితో ఆయన కార్యక్రమాలు నిర్వహించేవారు. విద్యార్థులకు జాషువా పట్ల అవగాహన కోసం సభలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించేవారు. అనేకసార్లు కవి సమ్మేళనాలు కూడా నిర్వహించి జాషువా కవితావైశిష్ట్యాన్ని నేటితరం వారికి కూడా చాటేవారు. రాష్ట్రవ్యాప్తంగా కవులతో, ఎంతో మంది ప్రముఖులతో ఆయనకు మంచి పరిచయాలుండేవి. ఎంతోమంది ఐఏఎస్ అధికారులు, ఐపిఎస్ అధికారులను కూడా ఈ సభలకు పిలుచుకువచ్చేవారు. జాషువా కార్యక్రమాలను నిర్వహించాలంటే కిరణశ్రీయే చేయాలి అన్నట్లుగా చిత్తశుద్ధితో ఎంతో గొప్పగా చేసేవారాయన. కవి, రచయితగా కూడా ఆయన లబ్ధప్రతిష్టుడు. సులభాంధ్ర వ్యాకరణం, కిరణ్ పంచవింశతి, పిచ్చివాడు, ఆణిముత్యాలు, బడిపంతులు వంటి రచనలు ఆయనకెంతో పేరు తెచ్చాయి. సాహిత్యంతో పాటు పలు పాఠ్యగ్రంథాలను కూడా రచించారాయన. 1995 నుంచి 2019 దాకా ప్రభుత్వ పాఠ్యగ్రంథ రచయితగా ఏడవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులకు కూడా అవసరమైన గ్రంథాలను రచించి పేరెన్నికగన్నారు. ఆయన మృతికి నెల్లూరుజిల్లాలోని అనేకమంది కవులు, రచయితలు, ఆయన సహచరులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

---

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

### చేనేతకారుల

# దుస్థితి మారదా?

చేనేతకారుల పరిస్థితి రానురాను దయనీయంగా మారుతోంది. ముడిసరుకుల ధరలు పెరగడంతో నేత నేయడం పేద చేనేతకారులకు అసాధ్యంగా ఉంటోంది. అసలే అప్పులతో, ఆర్థిక అవస్తలతో జిల్లాలోనే కాదు రాష్ట్రంలో వేలాది మంది నిరుపేద చేనేతకారులు ఎన్నో అవస్తలు పడుతున్నారు. నేతకారులతో పాటు వారితో కలసి పనిచేసే అనుబంధ వృత్తుల వారి జీవనపరిస్థితులు కూడా దుర్భరంగానే ఉంటున్నాయి. చేనేతకారుల దుస్థితి ఎప్పుడు మారుతుందో ఆ దేవుడికే తెలియాలి. ఎన్ని ప్రభుత్వాలు మారినా పాలకులు ఎందరు మారినా నేతన్నల బ్రతుకులు మాత్రం అనాదిగా మారడమే లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కారులను ఇతోధికంగా ఆదుకోవాలి. ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. చేనేత వస్త్రాలను మరింతగా ప్రోత్సహించాలి. వృత్తిని నమ్ముకుని, ప్రతిభతో జీవించే నేతన్నల ఇబ్బందులు తీర్చేందుకు అన్ని విధాలుగా చేయూత నందించాలని ప్రార్థన.

**వి.సీతారామచంద్రయ్య, కోవూరు.**

---

### సర్వేపల్లిని నెల్లూరులో ఉంచడం

# మంచి నిర్ణయం

జిల్లాల పునర్విభజనలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలోనే ఉంచాలని నిర్ణయించడం స్వాగతించతగ్గ నిర్ణయం. ఎంతో ఘనచరిత్ర కలిగిన నెల్లూరుజిల్లా ఇప్పుడు చిన్నబోతోందని మన 'లాయర్'లో వచ్చిన వార్త చూసి బాధ కలిగింది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో నెల్లూరుజిల్లాపై ప్రత్యేక మమకారాన్ని చూపించేవారు. ఆయన హయాంలోనే కృష్ణపట్నం పోర్టు, మేనకూరు టెక్స్‌టైల్ పార్కు, చింతవరం పారిశ్రామికవాడలతో పాటు నెల్లూరుజిల్లా ముఖద్వారంగా శ్రీసిటీ ప్రత్యేక పారిశ్రామికవాడ కూడా ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న జిల్లాల విభజనలో ఒకరకంగా చెప్పాలంటే నెల్లూరుజిల్లా అన్నివిధాలా అనాథగా మిగిలింది. పార్లమెంటు నియోజకవర్గ ప్రాతిపదికన విభజన జరిగి సర్వేపల్లిని కూడా నెల్లూరుజిల్లా కోల్పోయి ఉంటే... ఇక నెల్లూరు అధోగతి పాలయ్యివుండేది. గుడ్డిలో మెల్ల అన్నట్లుగా సర్వేపల్లిని నెల్లూరులోనే మిగిల్చి విభజన ప్రక్రియకు శ్రీకారం చుట్టడం మంచి నిర్ణయం.

**ఆర్.పి. రామయ్య, కొండాయపాలెం, నెల్లూరు.**

# రాష్ట్రాన్ని పట్టించుకోకపోవడం అన్యాయం

ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి చెందడానికి చేయూతనివ్వాల్సిన కేంద్రం బడ్జెట్‌లో అసలు రాష్ట్రాన్ని పట్టించుకోకపోవడం అన్యాయం. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను కేంద్రప్రభుత్వం ఇప్పటికీ అమలుచేయకపోవడం బాధాకరం. ఏళ్లు గడిచిపోతూనే ఉన్నాయి. ఇచ్చిన వాగ్దానాలు నేటికీ నెరవేరకపోవడం విచారకరం. విభజనతో ఏపీకి అన్నీ అవస్తలే మిగిలాయి. అన్ని రంగాలు సంక్షోభంలో ఉన్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం ఎంతో వెనుకబడి ఉంది. అనేక ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్నాయి. ఈ విషయాలన్నీ అందరికీ తెలిసినవే. ఇకనైనా రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందేందుకు కేంద్రం సహకరించాలని ప్రార్థన. పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులిచ్చి త్వరలో ఆ ప్రాజెక్టు పూర్తయ్యేలా సహకారం అందించాలి. విభజన హామీలు అమలుచేయాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన వారే వాటిని పట్టించుకోకపోతే ఎవరికి చెప్పుకోవాలి?..ఇప్పటికైనా కేంద్రం పెద్దమనసు చేసుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజల బాగోగులు చూడాలి. ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రరాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి.

**సిహెచ్ గంగాధర్, ముత్తుకూరు.**

## నాలుగులైన్ల రహదారి..
# నిర్మాణం ఎప్పుడు?
### - పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి



కర్నాటక సరిహద్దు నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లోని గుత్తి వరకు 995 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణ ప్రతిపాదన ఎప్పటి నుంచి అమలులోకి వస్తుంది?..ఆ ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి ఏమిటి?..సమయం, ఖర్చు ఏదైనా అధికంగా ఉందా?..వివరాలేమిటి?..అని ఈనెల 9న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. ఆ ప్రాజెక్టు ఎప్పటికి పూర్తయ్యే అవకాశం ఉందో తెలపాలని అడిగారు. అందుకు స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సమాధానమిస్తూ, ఈ నిర్మాణం ఇప్పటికే 2016 మే 6వ తేది నుంచి ప్రారంభమైందని, 2018 మే 5నాటికి పూర్తయ్యేలా షెడ్యూల్ ఉందని తెలిపారు. భూసేకరణలో జాప్యం, కోవిడ్ నేపథ్యం, రైల్వే క్లియరెన్స్‌లు జాప్యం కావడంతో ప్రాజెక్టు నిర్ణీత గడువులోపు పూర్తికాలేదన్నారు. 2022 డిసెంబరు 31 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంటుందని, ప్రాజెక్టులో అధిక వ్యయమేమీ లేదని పేర్కొన్నారు.

### అప్రెంటిస్ చట్టం సవరిస్తారా?

శిక్షణ మరియు విద్యాసంస్థలు అప్రెంటిస్‌లను నియమించుకోవడానికి, ఆన్‌లైన్‌లో శిక్షణ అందించడానికి అనుమతించడం కోసం అప్రెంటిస్ చట్టం-1961ని సవరించాలని సంబంధిత మంత్రిత్వశాఖ ఆలోచిస్తున్నదా?..అయితే ఆ వివరాలేమిటి?.. ఆన్‌లైన్ ద్వారా నైపుణ్యాలను ఎలా అభివృద్ధి చేయవచ్చు?.ప్రతిపాదిత మార్పులు అప్రెంటిస్‌షిప్ పరిధిని, మరిన్ని ప్రాంతాల్లో సౌకర్యాల లభ్యతను ఎలా పెంచుతాయి?..దేశంలో అప్రెంటిస్‌లను ఏమేరకు పెంచుతాయి?..అని వేమిరెడ్డి ఈనెల 9న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమాధానమిస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం ఆ విషయమై సంప్రదింపులు జరుపుతోందని, అప్రెంటిస్ ప్రక్రియలు, మార్గదర్శకాలు, నియమాలను మెరుగుపరచడానికి వాటాదారులు అప్రెంటిస్ చట్టం 1961కి సవరణ ముసాయిదా ఖరారు చేయబడుతుందని తెలిపారు. అయితే, అప్రెంటిస్ చట్టం 1961 యొక్క నిబంధనల ప్రకారం విద్య, మరియు శిక్షణ సంస్థలు ఇప్పటికే ఉన్న ప్రకారం అప్రెంటిస్‌లను నియమించుకోవడానికి అనుమతించబడతాయని పేర్కొన్నారు. అప్రెంటిస్ శిక్షణ అమలు మార్గదర్శకాలను మంత్రిత్వశాఖ సులభతరం చేసిందని, దీని ద్వారా ప్రాథమిక శిక్షణ ఆన్‌లైన్ మోడ్ పంపిణీని అనుమతిస్తుందని, దీనిద్వారా దేశంలోని అప్రెంటిస్ స్థాపనలు పెరగడానికి మార్గం ఏర్పడుతుందని వివరించారు.

### స్విమ్స్‌కు పరికరాల ప్రతిపాదనపై..

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన పథకం కింద తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్) కోసం ప్రతిపాదించిన పరికరాల వివరాలు తెలపాలని ఈనెల 8న పార్లమెంట్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. విజయవాడలోని సిద్ధార్థ వైద్యకళాశాల, అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం వాస్తవమేనా?.. అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. వాటి వివరాలను తెలపాలన్నారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి డా.భారతి ప్రవీణ్‌పవార్ సమాధానమిస్తూ ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన తొలి విడతలో స్విమ్స్‌లో వైద్య పరికరాలను అప్‌గ్రేడ్ చేసేందుకు 120 కోట్ల రూపాయలు(ఇందులో కేంద్రం 60 కోట్లు, స్విమ్స్ 60 కోట్లు వాటా)తో ఆమోదించబడిందని తెలిపారు. కేంద్రం తన వాటా కింద ఇప్పటికే 58.31 కోట్లు విడుదల చేసిందన్నారు. ఫేజ్-3 కింద విజయవాడ, అనంతపురం వైద్యకళాశాలల అప్‌గ్రెడేషన్ జరుగుతుందన్నారు.

## విద్యుత్ సమస్యలు తీరుస్తాం

నెల్లూరులోని ఏ.కె.నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై ఈ నెల 8న ఏర్పాటు చేసిన సమావేశంలో డి.ఇ సోమశేఖరరెడ్డి, ఏడిఇ అల్తాఫ్ మాట్లాడారు. విద్యుత్ సమస్యలు అన్నీ తీరుస్తామని చెప్పారు. కార్పొరేటర్లు సాయి సునీల్, మురహరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు..
# రాయితీలతో ప్లాట్లు
### 'జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్'లకు కొత్త మార్గదర్శకాలు

ప్రభుత్వ ఉద్యోగులకు రాయితీలతో ఇళ్ళ ప్లాట్లు ఇవ్వాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మధ్యతరగతి ప్రజలను, అల్పాదాయ వర్గాలవారిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మిస్తున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లలో ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇళ్ళ ప్లాట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందుకు కొత్తగా మార్గదర్శకాలు విడుదలైనట్లు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు ఈనెల 8న ఒక ప్రకటనలో తెలియజేశారు. నెల్లూరు నగరాభివృద్ధి సంస్థ(నుడా) పరిధిలో కావలి దగ్గర జలదంకి మండలం జమ్మలపాలెంలో 97.16 ఎకరాల విస్తీర్ణంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ నిర్మాణం జరుగుతుందని, డిటిసిపి అప్రూవల్‌తో దీనిని అభివృద్ధి చేస్తున్నామని, ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగులకు పాట్ల అమ్మకం ధరపై 20 శాతం రాయితీతో 10 శాతం ప్లాట్లను ప్రత్యేకంగా రిజర్వ్ చేయడం జరిగిందని ఆయన వివరించారు.

మొదటి క్యాటగిరీ ప్లాట్ (ఎంఐజి-1) 147 చదరపు గజాల విస్తీర్ణం, రెండో కేటగిరీలో 200 గజాలు, మూడో కేటగిరీలో 240 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడుతున్నామని, ఒక్కో చదరపు గజం ధర 4,999 రూపాయలుగా నిర్ణయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు ఎంఐజి-1 ఇల్లు 20 శాతం సబ్సిడీతో 5,87,882 రూపాయలకు, ఎంఐజి-2 ఇల్లు 7,99,840 రూపాయలకు, ఎంఐజి-3 ఇల్లు 9,59,808 రూపాయలకు లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

# 5 లక్షలతో.. వాటర్‌ప్లాంట్
### ○ నిధులిచ్చిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అందజేసిన 5 లక్షల రూపాయల నిధులతో ఆ గ్రామంలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటైంది. ఇందుకూరుపేట మండలంలోని ములపాడు గ్రామంలో నెలకొల్పిన ఈ వాటర్‌ప్లాంట్‌ను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల ప్రారంభించారు. ఆ గ్రామంలో అర్హులైన 48 మంది ప్రజలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, మండల పార్టీ అధ్యక్షులు మవులూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసి కరుణాకర్, గొల్లపల్లి అవినాష్ పాల్గొన్నారు.

# ఆర్‌బికేల ద్వారానే.. ధాన్యం కొనుగోళ్ళు

దళారి వ్యవస్థ లేకుండా జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల పరిధిలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు తెలిపారు. ఈనెల 7న ఆయన సంగం మండలంలోని సిద్ధీపురం గ్రామ సచివాలయాన్ని, పడమటిపాలెం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును, జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం పురోగతిని పరిశీలించారు. ప్రతి నెలా నిర్దేశించిన విధంగా గ్రామ సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన చక్కటి అవకాశమని, గ్రామ వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ తీసుకొని అర్హులందరూ జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆ పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు రుణవిముక్తి పత్రాలను అందచేశారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఈ-క్రాప్ నమోదును ప్రామాణికంగా తీసుకుని ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని స్పష్టంచేశారు. ఇప్పటికే జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ధాన్యం సేకరణలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్.బి.కె స్థాయిలోనే ధాన్యాన్ని సేకరించి నేరుగా సంబంధించిన మిల్లర్లకు పంపడం జరుగుతుందని తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో సంగం మండలం ప్రత్యేకఅధికారి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు చెన్నయ్య, తహసీల్దారు నిర్మలానందబాబు, ఎం.పి.డి.ఓ నాగేంద్రబాబు, వ్యవసాయ శాఖ, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.


## భాష్పాంజలి



మంచిమనిషి, మితభాషి,
సేవాభిలాషి, స్నేహాభిలాషి
మాకు హితైషి, నా శ్రేయోభిలాషి
**ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి గారి**
మృతికి చింతిస్తూ...
మా భాష్పాంజలి.

**కోడూరు మధుసూదనరెడ్డి**
తపస్య విద్యాసంస్థలు
హైదరాబాదు.

నిర్యాణము జనవరి 31, 2022

## జిల్లాలో 17,857 మందికి

# 'జగనన్న చేదోడు'



జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద రెండోవిడతగా 17,857 మంది లబ్దిదారులకు 17.85 కోట్ల రూపాయలను అందజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. ఈనెల 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని తాడేపల్లిలోని కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు చేదోడుగా మొత్తం 285.35 కోట్ల రూపాయల ఆర్థికసాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమచేశారని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో అర్హులైన లబ్దిదారులకు 10వేల రూపాయల వంతున ఆర్థికసాయం అందజేశారన్నారు. అయిదేళ్ళ పాటు ఈ సాయం అందుతుందని, ఈ పథకానికి సంబంధించి ఇంకా ఎవరైనా అర్హత ఉన్నవారు ఉంటే వారు సమీపంలోని గ్రామ, వార్డు సచివాయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అంద జేస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ రోజ్‌మాండ్, బిసి కార్పొరేషన్ ఇ.డి బ్రహ్మ నందరెడ్డి, జిల్లా బిసి సంక్షేమ అధికారి వెంకటయ్య, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఆసిఫా బాబా, జంగం కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ప్రసన్నమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 17.85 కోట్ల రూపాయల నమూనా చెక్కును లబ్దిదారులకు అందజేశారు.

## నేషనల్ చెస్ ఆర్బిటర్‌గా..

# 9వ తరగతి విద్యార్థిని యోచన



చిన్న వయసులోనే జాతీయస్థాయి చెస్ ఆర్బిటర్‌గా ఎంపికైన యోచనను అందరూ అభినందిస్తున్నారు. అఖిలభారత చదరంగ సమాఖ్య ఇటీవల నిర్వహించిన ఆర్బిటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో ఆమెకు ఈ ఖ్యాతి లభించిందని ఆంధ్ర చెస్ అసోసి యేషన్ అధ్యక్షుడు కెవివి శర్మ తెలిపారు. నెల్లూరులోని శ్రీసాయి మహావిద్యాలయలో చెముకుల యోచన 9వ తరగతి చదువుతోంది. ఇంత చిన్నవయసులోనే యోచన జాతీయ స్థాయిలో ఎంపికై, జిల్లాలోనే తొలి చెస్ ఆర్బిటర్ కావడం జిల్లాకే గర్వ కారణమని పలువురు ఆమెను అభినందించారు. విద్యాలయం నిర్వాహకులు, ఉపాధ్యాయులతో పాటు ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.మస్తాన్‌బాబు, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# సాయిబాబా మందిరంలో వార్షికోత్సవ వేడుకలు



వస్త్రదానం చేస్తున్న కిలారి వెంకటస్వామినాయుడు దంపతులు

నెల్లూరు భక్తవత్సలనగర్‌లో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 6న విశేష పూజలు జరిగాయి. మందిరం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారిని కన్నులపండువగా అలంకరించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాధునికి ఉదయం నుంచి రాత్రి దాకా భక్తిశ్రద్ధలతో పూజలు, సేవలు చేశారు. విశిష్ట హారతులిచ్చారు. ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని సాయినాధుని దర్శించు కున్నారు. అనంతరం సాయిబాబా మందిరం కమిటీ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు దంపతుల ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం, అన్నదానం జరిగింది.

# నెల్లూరు కబుర్లు

## ఆదాని సంస్థతో విఎస్‌యు ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న విఎస్‌యు, ఆదాని సంస్థల ప్రతినిధులు

దేశంలో ప్రతిష్ఠాత్మకమైన ఆదాని సంస్థతో నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అవసరమైన ఒప్పందం చేసుకున్నారు. ఇటీవల విఎస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి, ఆదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సంస్థ జోనల్ హెడ్ ధనిష్ ఖురేషి మధ్య ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా ఆదాని సంస్థ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విద్యార్థులకు వృత్తి మరియు ఆధునిక నైపుణ్యాలను పెంపొందించడానికి అవసరమైన శిక్షణ ఇస్తారు. ఆదాని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డిప్లొమా, ఒకేషనల్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు నిర్వహిస్తుందని, ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో వివిధ విభాగాల్లో నైపుణ్యాలను కలిగిస్తారని, తద్వారా విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. శిక్షణ పూర్తిచేసుకొన్న విద్యార్థులలో మెరుగైన నైపుణ్యాలను ప్రదర్శించిన విద్యార్థులకు ఉద్యోగాలు ఇచ్చే అవకాశం కూడా ఉందని రిజిస్ట్రార్ ఎల్‌వికె రెడ్డి తెలిపారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందరవల్లి సమక్షంలో ఇరు సంస్థలు ఆమేరకు అవగాహనా ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

## విఎస్‌యులో అవగాహన సదస్సు




నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 8న 'ది రోల్ ఆఫ్–14సి ఏపిఐ సైనటీస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.హరి పెన్నాక పాల్గొని విద్యార్థులకు 14–సి రేడియో ఐసోటోప్ ప్రాముఖ్యతను వివరించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా.ఎల్ విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ మానవాళికి ఎంతో ప్రయోజనకరమైన 14సి విశిష్టతను విద్యార్థులు తెలుసుకోవా లన్నారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతా యన్నారు. అనంతరం హరి పెన్నాకను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. పి.త్రివేణి, డా.వై.విజయ, డా.టి.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధన్యజీవి ఆరణి కందప్ప



కందప్ప మేస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వేగూరు రవీంద్రరెడ్డి తదితరులు

ఆరణికందప్ప మేస్త్రీ జీవితం భావితరాలకు మార్గదర్శకమని, మేస్త్రీగా ఉంటూ ఆయనెందరికో అన్నదానాలు చేసేవారని, పేదలు, రోగులకు వసతి కల్పించేందుకు గతంలో ఆయన నిర్మించిన సత్రం నెల్లూరులో ఆరణి కందప్ప మేస్త్రీ సత్రంగా నేటికీ ఆయన సేవలకు ప్రతిరూపంగా ఉందని దేవాదాయశాఖ విశ్రాంత సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి అన్నారు. ఆరణి కందప్ప మేస్త్రీ జయంతి సందర్భంగా నగరంలోని సంతపేటలో ఉన్న సత్రంలో కందప్ప జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నగరంలోని సర్వోదయ కాలేజీ, ఆదిత్య కళాశాలల్లో డిగ్రీ, ఇంటర్ చదువుకుంటున్న 76 మంది ప్రతిభగల విద్యార్థులకు 2500 రూపాయల వంతున నగదు ప్రోత్సాహం అంద జేశారు. మరో 350 మంది పేదలకు దుప్పట్లు అందజేసి, వెయ్యి మందికి అన్నదానం చేశారు. ఆరణి కందప్పమేస్త్రీ సత్రం ఇ.ఓ రాధా కృష్ణయ్యతో పాటు, దేవాదాయశాఖ సూపరింటెండెంట్ వెంకట రమణ, సర్వోదయ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేరు పెట్టినందుకు.. ధన్యవాదాలు!

- డా॥ పి.ఎల్.రావ్ కుటుంబం



నెల్లూరు పొగతోటలోని నాగులమిట్ట రోడ్డు నుంచి ట్రంకురోడ్డు వరకు ఉన్న వీధికి డాక్టర్ పి.ఎల్.రావు వీధిగా నామకరణం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి డా॥ అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఈ నెల 4న ధన్యవాదాలు తెలిపిన పాబోలు కుటుంబీకులు డాక్టర్ భారతి తదితరులు

## వచ్చే సంవత్సరం నుంచి..

# జాతీయ విద్యా విధానం

### జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్

వచ్చే విద్యా సంవత్సరం 2022–23 నుంచి జాతీయ విద్యా విధా నాన్ని అమలుచేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ ఈనెల 8న ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను అనుసంధానం చేసి ప్రీప్రైమరీ, ఫౌండేషన్, సెకండరీస్కూళ్ళుగా నామ కరణం చేయడం జరుగుతుందని, 3వ తరగతి నుంచి ప్రతి విద్యార్థికి సబ్జెక్ట్ టీచర్‌తో బోధన జరుగుతుందని తెలిపారు. ప్రతి మండలంలోనూ బాలికల కోసం ఒక జూనియర్ కళాశాల ఏర్పాటవుతుందని, జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలలను జడ్పీ జూని యర్ కాలేజీలుగా ఉన్నతీకరించనున్నామని పేర్కొన్నారు. ప్రతి మండ లంలో కనీసం రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని, జాతీయ విద్యావిధానం అమలుతో పాఠశాల కానీ, అంగన్‌వాడీ కేంద్రం గానీ మూసివేయడం జరగదని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, ఫౌండేషన్ స్కూల్ ప్లస్, ప్రీహైస్కూల్, హైస్కూల్, హైస్కూల్ ప్లస్‌గా పాఠశాలలకు నామ కరణం చేస్తామని వివరించారు. ఉపాధ్యాయులు వ్యక్తిగత సమాచారాన్ని ఈనెల16వ తేది లోగా సిఎస్ఇ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా అప్‌డేటు చేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు, బదిలీలను మే 30వ తేది లోపు పూర్తిచేస్తామని, ఎంఇఓలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పిస్తూ ఖాళీలుగా ఉన్న ఎంఇఓల పోస్టులను భర్తీచేస్తామని తెలియజేశారు.

# ఇంటర్ ప్రీ ఫైనల్ పరీక్షలు 21 నుంచి

ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈనెల 21వ తేది నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్‌బోర్డు నుంచి ఆదేశాలు వచ్చాయని జిల్లా ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వరప్రసాదరావు ఈనెల 8న ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

# 27 నుంచి పల్స్‌పోలియో

నెల్లూరులోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఈనెల 8న ధనుర్వాతం, కోరింత దగ్గు, కంఠసర్పి వ్యాధుల నివారణకు వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 27 నుంచి మార్చి 1వ తేది వరకు పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహణకు సిబ్బంది సమాయత్తం కావాలని సూచించారు.

# డికెడబ్ల్యులో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ



మాట్లాడుతున్న డికెడబ్ల్యు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీలో ఈ నెల 7న ఎన్ఎస్ఎస్ వలం టీర్లకు శిక్షణా తర గతులు నిర్వహి చారు. ఈ సంద ర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సేవాభావాన్ని పెంపొందిస్తుందని, విద్యార్థినులు పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.అరుణకుమారి పాల్గొన్నారు.

## వృద్ధుల ఆరోగ్యానికి
# ఆయుష్ చేసిందేమిటి?

### - పార్లమెంట్‌లో ప్రశ్నించిన నెల్లూరు ఎంపీ ఆదాల



వృద్ధుల కోసం ఆయుష్ తీసుకున్న చర్యలు ఏమిటని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర ఆయుష్‌మంత్రి సర్బానంద సోనోవాల్ రాత పూర్వకంగా సమాధానమిస్తూ దేశంలో కోవిడ్-19 మహమ్మారి తర్వాత వృద్ధుల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి 60 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తులకు ఆయుష్ ప్రొఫైలాక్టిక్ మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయుర్వేదంతో సహా ఆయుష్ వ్యవస్థల నుంచి కోవిడ్-19 నివారణకు రోగనిరోధక మందులు సాధారణ ప్రజలకు సైతం సిద్ధ, యునాని, హోమియోపతి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### కేంద్ర న్యాయశాఖలో ఖాళీల భర్తీకి ఏం చర్యలు తీసుకున్నారు?

కేంద్ర న్యాయశాఖ విభాగంలో ఖాళీల భర్తీకి ఏం చర్యలు తీసుకున్నారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఈ ఖాళీలు దాదాపు 50 శాతం ఉన్నట్లు సమాచారం అందిందని, అది నిజమేనా అని కూడా అడిగారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు దీనికి రాతపూర్వకంగా సమాధానమిస్తూ ప్రస్తుతం న్యాయశాఖలో461 పోస్టులకుగాను దాదాపు 171 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

### మహిళా సాధికారతకు ప్రణాళికలేమిటి?

ఏపీలో వైఎస్సార్ చేయూత పథకం లాగా కేంద్రప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రణాళికలేమైనా రూపొందిస్తోందా? అని ఆదాల ఈనెల 7న జరిగిన పార్లమెంట్ సమావేశంలో ప్రశ్నించారు. అందుకు కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమాధానమిస్తూ అటువంటి పథకం ఏమీ లేదని, అయితే మహిళలు పరిశ్రమలు ఏర్పాటుచేసుకునేందుకు ఆర్థిక సాధికారత కోసం కొన్ని పథకాలను కేంద్రం అమలుచేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం ద్వారా పూచీకత్తు లేని రుణాలు మహిళలకు అందజేసేందుకు కృషి జరుగుతోందని పేర్కొన్నారు.

### ఏపీలో 'నాట్రాక్స్' ఏర్పాటు ఆలోచన ఉందా?..

ఏపీలో నేషనల్ ఆటోమొబైల్ టెస్ట్ ట్రాక్స్ (నాట్రాక్స్) శాఖను ఏర్పాటుచేసే ఆలోచన ఏమైనా ఉందా?.అని ఈనెల 7న జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఎంపీ ఆదాల ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి క్రిషన్‌పాల్ రాతపూర్వకంగా సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఆటోమోటివ్ కాంపోనెంట్స్ తయారీదారులు గణనీయంగా ఉన్న విషయం వాస్తవమేనని, అయితే ప్రస్తుతం ఏపీలో ఉన్న 100 యూనిట్ల కోసం 4 పరీక్ష కేంద్రాలున్నాయని, అందువల్ల నాట్రాక్స్ శాఖ ప్రతిపాదన ఏదీ లేదని తెలిపారు.

### ప్రొఫెషనల్ అసిస్టెంట్ పోస్టులకు యుజిసిని అమలుచేస్తారా?

జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎన్‌సిఇఆర్‌టి) కేంద్రాల్లో పనిచేసే ప్రొఫెషనల్ అసిస్టెంట్ పోస్టులకు యుజిసిని అమలుచేస్తున్నారా?.. అని ఈనెల 8న నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో ప్రశ్నించారు. అందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి డా.సుభాష్‌సర్కార్ లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ ఈ పోస్టులు పూర్తిగా సాంకేతికత ఆధారంగా పరిగణింపబడుతాయని, అందువల్ల అస్యూర్డ్ కెరీర్ ప్రొగ్రెషన్ పథకం వారికి వర్తించదని తెలిపారు. అయితే ఇతర అడ్మినిస్ట్రేటివ్ టెక్నికల్ అనుబంధ సిబ్బందితో సమానంగా కేంద్రప్రభుత్వం ఏసిపి పథకం ప్రయోజనాలను విస్తరించాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు.

### పశువైద్య అవసరాలకు అంబులెన్సులు నడుపుతారా?

పశువైద్య అవసరాల కోసం ఆంధ్రప్రదేశ్‌లో లాగా కేంద్రప్రభుత్వం అంబులెన్సులు నడిపే ప్రతిపాదన ఏదైనా ఉందా అని ఎంపి ఆదాల ఈనెల 8న పార్లమెంట్‌లో ప్రశ్నించగా, కేంద్ర పాడిపరిశ్రమాభివృద్ధి మంత్రి పురుషోత్తం స్పందిస్తూ, కేంద్రం లైవ్‌స్టాక్ హెల్త్ డిసీజెస్ కంట్రోల్ ప్రోగ్రామ్ కింద అన్ని రాష్ట్రాలకు ఆర్థికసాయం అందిస్తోందని తెలిపారు. రైతుల ఇళ్లవద్దకే మొబైల్ వెటర్నరీ సేవలు అందించాలనే ప్రతిపాదన ఉందని, అది పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో అమలయ్యే అవకాశం ఉందన్నారు. ఆయా పరిస్థితులను బట్టి వీటికి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు.

## తొలినెల జీతం..శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయానికి

కొత్తగా ఉద్యోగంలో చేరిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన తొలి నెల జీతాన్ని విరాళంగా సమర్పించి స్వామివారిపై తన కున్న భక్తిని చాటుకున్నాడు. తన అవ్వాతాతలైన అల్లూరు వెంకటసుబ్బయ్య, తిరుపాలమ్మ జ్ఞాపకార్థం వారి మనుమడు అల్లూరు అనిరుధ్ పొదలకూరులో నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి తన మొదటి నెల జీతం 21వేల రూపాయలను ఈనెల 7న అందజేసి అభినందనలు అందుకున్నాడు.

# కావలికి త్వరలోనే మహర్దశ

### - మంత్రి గౌతంరెడ్డి



జిల్లా పునర్విభజనలో భాగంగా నెల్లూరు తర్వాత త్వరలోనే కావలికి మంచిరోజులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి చెప్పారు. ఈనెల 7న ఆయన కావలిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాల పునర్విభజనలో జిల్లాలో 3 డివిజన్లు ఉంటాయని, వాటిలో నెల్లూరుకి 12, కావలికి 12, ఆత్మకూరుకు 11 మండలాల వంతున మొత్తం 35 మండలాలు ఏర్పాటవుతాయని అన్నారు. కావలి నియోజకవర్గంలో ముఖ్యంగా దగదర్తి ఎయిర్‌పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్, పారిశ్రామికవాడలు ఏర్పాటవుతాయని, తద్వారా ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందడమే కాక ఎంతోమందికి ఉపాధి కలుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రతాప్‌తో పాటు, ఆర్డీఓ శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి.. ఎమ్మెల్యే ప్రసన్న విరాళం





మన ఊరు.. మన దేవాలయాలను మనమే పరిరక్షించుకోవాలని, వాటిని అభివృద్ధి చేసుకోవాలని, తద్వారా ఎంతో గొప్పదైన మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని కేవలం మాటల్లో చెప్పడమే కాక కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తనవంతు చేయూతగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భారీగా విరాళాలు అందిస్తుండడం విశేషం. ఇప్పటికే తమ నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి ఆయన తనవంతు సహకారం అందించారు కూడా. తాజాగా కోవూరు నియోజకవర్గంలో ఒక ఆలయం నిర్మాణానికి, మరోచోట ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి ప్రసన్న రెండు లక్షల రూపాయల విరాళం అందించారు. విడవలూరు మండలంలోని దంపూరు మిక్స్‌డ్ కాలనీలో కొత్తగా నిర్మాణం చేస్తున్న శ్రీ కళ్యాణ రామస్వామి మందిరానికి లక్ష రూపాయలు ఇచ్చారు. దంపూరుకు చెందిన నాయకులకు ఆ విరాళాన్ని అందజేశారు. సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఎంపిటిసి భానుప్రకాష్, శ్రీనివాసులు, నారాయణ, శ్రీనివాసులు రెడ్డి, ఫణికిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కోవూరు మండలంలోని పాటూరులో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణం కోసం పాటూరు నాయకులకు మరో లక్ష రూపాయల విరాళం అందజేశారు. నెల్లూరులోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసన్నతో పాటు డిఏఏబి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, మధురెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ముఖ్యం

### - అపోలో వైద్యులు హరిత, శ్రీరామ్ సతీష్




క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం ముఖ్యమని, అలా గుర్తించినప్పుడే సత్వర చికిత్సలు అందించి క్యాన్సర్‌ను నివారించగలమని స్థానిక అపోలో హాస్పిటల్ సీనియర్ అంకాలజిస్ట్ డాక్టర్ హరిత, అపోలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6న నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, 'క్లోజింగ్ ది కేర్ గ్యాప్' అనే నినాదంతో ఈ ఏడాది క్యాన్సర్ దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాన్సర్ విషయంలో సాధారణ ప్రజలు కొంత భయాందోళన చెందుతారని, కానీ ఆ వ్యాధిపై అవగాహన, దానిని త్వరితగతిన గుర్తించగలిగితే ఆందోళన అవసరం లేదన్నారు. క్యాన్సర్‌కు అధునాతన చికిత్సలు అందుబాటులోకి వచ్చినా, అవగాహనా లోపంతో అవి గ్రామీణ ప్రజలకు చేరువ కావడం లేదని, క్యాన్సర్‌ను గుర్తించడంలో గ్రామీణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ముఖ్యంగా ఊబకాయం ఉన్నవారు, ధూమపానం, పొగాకు అధికంగా వాడే వారు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. క్యాన్సర్‌పై అవగాహన వర్క్ షాపులు నిర్వహించడం ద్వారా ఈ వ్యాధిపై అవగాహన పెరుగుతుందని, ఇది క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. చిన్న పట్టణాల్లో సైతం క్యాన్సర్‌ను గుర్తించగలిగే వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం, ఆయుష్మాన్ పథకాలలో క్యాన్సర్ సంరక్షణను చేర్చిందని, ఇది చాలామంది రోగులకు సహాయపడుతుందని స్పష్టం చేశారు. అతి తక్కువ ఖర్చుతో క్యాన్సర్ చికిత్సలను అందుబాటులో ఉంచడానికి, గ్రామీణ క్యాన్సర్ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు కల్పించేందుకు అపోలో హాస్పిటల్స్ ముందడుగు వేసేందుకు సిద్ధంగా ఉందని వారు తెలిపారు.







# రాజ్యాంగాన్ని మార్చడం కుదరకే!.. లేకపోతేనా?!


'దున్నపోతు ఈనింది... అంటే... మన దొడ్లో కట్టెయ్...' అన్నట్లుగా మన రాజకీయాలు తయారైనట్లు కనబడుతున్నాయి. దున్నపోతు ఏమిటీ... ఈనడం ఏమిటీ అన్న ఆలోచనే వస్తున్నట్లు లేదు. వచ్చినా... పట్టించుకోవడం లేదు.

మన రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం ఉందని మొన్నీమధ్య తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గాలిలోకి ఒక బాణం వదిలారు.

అంతే! బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఇతర సంఘాల నేతలు... ఒక్కసారిగా పూనకానికి లోనయ్యారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చడానికి నీకెన్ని గుండెలు అని ఒకరంటే... ఆ రాజ్యాంగం వల్లే నువ్వు ముఖ్యమంత్రివి అయ్యావు తెలుసా అంటూ మరొకరు తగులుకున్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ అయితే కేసీఆర్ వ్యాఖ్యలకు నిరసనగా ఏకంగా ఢిల్లీలోనే మౌనదీక్ష చేశారు. కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అయితే... ఏకంగా కేసీఆర్‌పై పోలీసులకే ఫిర్యాదు చేశారు. ఇక, టీఆర్ఎస్ నాయకులైతే... 'ఏం? ఎందుకు మార్చగూడదు? ఇప్పటికి 100సార్లు సవరణలు చేసుకోలేదా?' అంటూ ఎదురుదాడికి దిగారు. మొత్తం మీద రాజకీయవర్గాల వారికీ, ఛానెళ్లవాళ్లకూ ఓ 10 రోజుల కాలక్షేపం అయింది.

రాజ్యాంగం మార్చాలని చెప్పిన కేసీఆర్ మొదటివారూ కాదు... చివరి వారూ కాబోరు. కేసీఆర్ కంటే దాదాపు నాలుగేళ్ల క్రిందటే రాజ్యాంగాన్ని మార్చడం బీజేపీ లక్ష్యమని కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే 2017 డిసెంబర్‌లో బహిరంగంగా ప్రకటించి, రాజకీయంగా సంచలనం సృష్టించారు. అప్పుడు కూడా నరేంద్ర మోదీయే మన ప్రధాని. ఆయన గానీ, నెంబర్ 2గా ఉన్న అమిత్‌షా గానీ అనంతకుమార్ హెగ్డే ప్రకటనను ఖండించలేదు. ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం లేదు అని చెప్పలేదు.

అనంతకుమార్ హెగ్డే చెప్పడానికి ఓ ఏడాదిన్నర ముందే.. అంటే 2016 జూన్‌లో మరో బీజేపీ భావజాల ప్రముఖుడు కూడా రాజ్యాంగాన్ని సమూలంగా మార్చడానికి ఇదే తగిన సమయం అంటూ ఓ జాతీయ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆయన పేరు రామ్‌బహదూర్ రాయ్. కేంద్రంలో ఒక్క పార్టీయే(బీజేపీ) పూర్తి మెజారిటీలో ఉందని, దేశంలోని అన్ని పార్టీలకూ లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉన్నందున ఇప్పుడు అమలులో ఉన్న రాజ్యాం గాన్ని మార్చడానికి ఇదే అనువైన సమయమని రామ్‌బహదూర్ రాయ్ అన్నారు. ప్రస్తుత లోక్‌సభను రాజ్యాంగ నిర్మాణ సభగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పుడు కూడా బీజేపీ నేతలు ఎవరూ స్పందించలేదు.






నిజానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నుంచి అధ్యక్ష తరహా (అమెరికా తరహా) ప్రజాస్వామ్య విధానంలోకి దేశ పాలనావ్యవస్థను మార్చాలని బీజేపీలో ఒక వర్గంలో ఉబలాటం గట్టిగానే ఉన్నట్టు చెబుతారు. నరేంద్ర మోదీ అంతటి ప్రజాకర్షణ కలిగిన మరో నేత కనుచూపు మేరలో ఏ పార్టీలోనూ లేకపోవడమే ఈ ఆలోచనకు ఒక ప్రధాన కారణం. అయితే, అధ్యక్ష తరహా ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రస్తుత రాజ్యాంగం అనుమతించదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నుంచి పక్కకు జరగడానికి కుదరదు. అదీ బీజేపీకి ప్రధానమైన గుర్రు. అయితే, దేశంలోని కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా నాటి మహామహులు అందరూ డాక్టర్ అంబేద్కర్ అధ్యక్షతన రూపొందించిన భారత రాజ్యాంగాన్ని మార్చాలి అని చెప్పే ధైర్యం బహిరంగంగా చెయ్యలేక సతమతం అవుతున్నారు. లోపల్లోపలే మథనపడుతున్నారు.

ఇప్పుడు, కేసీఆర్ ఆ మాట పైకి అనేసరికి బీజేపీ తెలంగాణ రాష్ట్రనేతలు.... మాటకు పది మాటలు అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకాలు చేశారు. ఢిల్లీలో బండి సంజయ్ & కో ఒకరోజు మౌనదీక్ష చేశారు. రేవంత్‌రెడ్డి అయితే.. ఏకంగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదే చేశారు, కేసీఆర్ దేశ ద్రోహానికి పాల్పడ్డారు అని.

మన రాజ్యాంగానికి ఇప్పటికి, ఈ 73 ఏళ్లల్లో 108సార్లు సవరణలు చేశారు. ప్రపంచం మొత్తం మీద ఇంత సమగ్రమైన రాజ్యాంగం గానీ, లిఖిత రాజ్యాంగం గానీ, ఇన్నిసార్లు(108) నేతల 'సవరణల దాడుల'కు గురైన రాజ్యాంగం గానీ మరొకటి లేదు.

### ఎందుకని ఇన్ని సార్లు రాజ్యాంగ సవరణలు చేశారు?

ఎప్పుడో 75 ఏళ్ల క్రితం నాటి రాజకీయవేత్తలకు దేశమే బతుకు. దేశమే ఊపిరి. దేశ క్షేమం కోసం తమ జీవితాలను ధారపోసిన నిస్వార్థ, ఉదాత్త చరితులు. ఆదర్శ మూర్తులు. భవిష్యత్‌లో కూడా తమంతటి ఉదాత్త, నిస్వార్థ చరితులే ప్రజా జీవనంలోకి వస్తారనే భావనతో...అంతటి ఉదాత్తమైన రాజ్యాంగాన్ని రూపొందించారు.

భవిష్యత్‌లో ప్రజా అవసరాల దృష్ట్యా ఏదైనా అధికరణాన్ని మార్చవలసి వస్తే, మార్చుకోవచ్చునని కూడా వారు... తమ ఔదార్యాన్ని రాజ్యాంగంలోనే పొందుపరిచారు.

దానిని అడ్డం పెట్టుకుని, మనవాళ్లు 108 సార్లు దానిని ఇప్పటికి మార్చారు.

ఈ సందర్భంగా రెండు ప్రశ్నలు తలెత్తుతాయి.

1. ఇన్నిసార్లు రాజ్యాంగ సవరణలు ఎందుకు చేశారు?
2. ఇన్నిసార్లు సవరణలు చేసేకంటే తమకు కావలసిన విధంగా ఎందుకు ఒక్కసారే మార్చుకోగూడదు?

మొదటి ప్రశ్నకు రాజ్యాంగంపై మన నేతలకు నమ్మకం, గౌరవం లేకపోవడం వల్లే అని చెప్పుకోవచ్చు. రాజ్యాంగం ప్రకారం మన నేతలు నడుచుకోవాలి. ఏ ప్రజా స్వామిక దేశంలో అయినా అక్కడి రాజ్యాంగం ప్రకారమే నేతలు నడుచుకుంటారు. నైతిక విలువలు కూడా విధిగా పాటిస్తారు. ఉదాహరణకు... బ్రిటిష్ ప్రధాని బోరిస్ జాన్సన్ రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోవాలని అక్కడి నేతలు, పత్రికలు ఉవ్వెత్తున లేస్తున్నాయి. ఆయన చేసిన నేరమల్లా... కోవిడ్ సమయంలో తన పుట్టినరోజున తన అధికార నివాసంలో మిత్రులతో కలిసి మందు పార్టీ చేసుకున్నారు. ఆయన సలహాదారులు నలుగురు కూడా ఈ పార్టీలో పాల్గొన్నారనే సమాచారం వెల్లడి కావడంతో, ఆ నలుగురూ మారు మాట్లాడకుండా రాజీనామా చేసి వెళ్లిపోయారు. కానీ మన దేశంలో... నేతల ఆలోచనల ప్రకారమే మన రాజ్యాంగం నడుచుకుంటోంది. భవిష్యత్‌లో కూడా అలాగే నడుచుకుంటుంది. దానికి మరో మార్గం లేదు.

ఇక, రెండవ ప్రశ్నకు రాజ్యాంగానికి ఎన్నిసార్లయినా టింకరింగు చేసుకోండి గానీ రాజ్యాంగ మౌలిక స్వరూపం మాత్రం మార్చకూడదనే సుప్రీంకోర్టు రూలింగ్ ఉండడం మన నేతల కాళ్లూ, చేతులను కట్టేసింది.

మనకు స్వాతంత్ర్యం (బ్రిటిష్ పాలన నుంచి. మన వారి పాలన నుంచి కాదు) వచ్చిన నాటి రోజుల్లో ప్రజాజీవనంలో ఉన్న నేతలతో... ఇప్పుడు ప్రజాజీవితంలో ఉన్న వారిని ఒక్కసారి పోల్చి చూసుకుంటే... ఒళ్ళు జలదరిస్తుంది. నేటి కాలపు నేతలకు రాజ్యాంగం అనేది పెద్ద అడ్డంకిగా కూడా తయారై ఉండవచ్చు. అందుకే, రాజ్యాంగాన్ని 108 సార్లు మార్పు చేశారని అర్థమవుతుంది. ఇంకెన్నిసార్లు మారుస్తారో అని తలచుకుంటే భయమేస్తోంది.

మన రాజ్యాంగం 1948లో అమలులోకి వస్తే, ఇప్పటికి 108సార్లు సవరణలు చేశాం. అదే... అమెరికా రాజ్యాంగం 1790లో అమలులోకి వస్తే ఇప్పటికి 27 సార్లు మాత్రమే సవరణలు చేశారు. గత 29 ఏళ్లల్లో అయితే ఒక్కసారి కూడా మార్చలేదు.

ఇక, మనం పరమ ప్రామాణికంగా భావించే బ్రిటిష్ రాజ్యాంగం పూర్తిగా లిఖితం కాదు. కొన్ని రాసుకున్నారు. కొన్ని రాసుకోలేదు. రాసుకోకుండా ఉన్న భాగాలను అయినా సరే రాజకీయ నాయకులు తమ ఇష్టానుసారం ఉల్లంఘించడం కుదరదు. కట్టుబాట్లు, సంప్రదాయాలను కూడా మార్చనివ్వకుండా బ్రిటిష్ సుప్రీంకోర్టు నిరంతరం నిఘా వేసి ఉంచుతుంది.

మనది లిఖిత రాజ్యాంగం అయితేనే ఇన్నిసార్లు సవరణలు చేస్తే.. ఇక అలిఖితం అయితే!!?. నిజానికి, మన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చే అవకాశం గానీ, బలం గానీ తనకు లేవని కేసీఆర్‌కూ తెలుసు. ఆయనను విమర్శించేవారికీ తెలుసు. అయితే, జాతీయస్థాయిలో తనకు గుర్తింపు రావాలనే భావనతో, ఆయన అంత స్పీడ్‌గా మాట్లాడి ఉంటారు. ఆయన లక్ష్యం ఆయనిది. ప్రతిపక్షాల లక్ష్యం ప్రతిపక్షాలది. ఎవరికీ రాజ్యాంగంపై గౌరవం లేదు. అయినా, ఆయన ఏదో మహాపరాధానికి పాల్పడినట్టుగా చిత్రించి అల్లరి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఈ సందర్భాన్ని బాగా వాడుకున్నారు. నిజానికి, రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి, కొత్త రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోగలిగిన వెసులుబాటు ఉంటే... బీజేపీ ఆ పనిని ఎప్పుడో చేసి ఉండేది. లేదంటే.. ఇందిరాగాంధీ ఆ పని 1975లోనే చేసి ఉండేవారు.

అయితే, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడానికి వీలు లేదని భారత సర్వోన్నత న్యాయస్థానం-1973 ఏప్రిల్ 24న(కేశవానంద భారతి VS కేరళ ప్రభుత్వం కేసులో) తీర్పు ఇచ్చింది. ఈ రాజ్యాంగ ధర్మాసనంలో 13 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

అందువల్ల, దేశానికి కొత్త రాజ్యాంగం అనేది కుదరదు. కాకపోతే, ఎన్నిసార్లయినా సవరణలు చేసుకోవచ్చు.

### ఏమిటా మౌలిక స్వరూపం?

నిజానికి, 'ఇదీ ఈ రాజ్యాంగ మౌలిక స్వరూపం. దీనిని మార్చడానికి వీలు లేదు...' అని మన రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో ఎక్కడా చెప్పలేదు. కాకపోతే, మన సుప్రీంకోర్టు వివిధ కేసుల విచారణ సందర్భాల్లో అటువంటి అభిప్రాయానికి నిదానంగా వస్తూ చివరిసారిగా 1973 ఏప్రిల్‌లో కేశవానంద భారతి VS కేరళ ప్రభుత్వం కేసులో ఇచ్చిన తీర్పులో ఈ విషయాన్ని తెగేసి చెప్పింది.

ఇవీ ఆ మౌలిక అంశాలలో కొన్ని...

1. రూల్ ఆఫ్ లా పాటించాలి.
2. ఏ చట్టం అయినా న్యాయ సమీక్షకు లోబడి ఉండాలి.
3. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలగకూడదు.
4. రాజ్యాంగమే సర్వోన్నతం
5. భారత దేశ సార్వభౌమ, సమగ్రతకు భంగం కలగకూడదు.
6. సార్వత్రిక ఓటు హక్కు ఉండాలి.
7. రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌కు ఉన్నది పరిమిత అధికారం మాత్రమే.
8. 32,136,142,147 అధికరణల కింద సుప్రీంకోర్టుకు గల విశేషాధికారాలు
9. 226, 227 అధికరణల కింద రాష్ట్ర హైకోర్టులకు గల అధికారాలు.

ఇలా ఉన్న రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చివేయడానికి కుదరదు. ఆ దిశగా ఎటువంటి ప్రయత్నం జరిగినా... సుప్రీంకోర్టు వెంటనే రంగంలోకి దిగుతుంది.

అందువల్లనే, తమకు కావలిసినప్పుడల్లా సవరణలు చేసుకుంటున్నారు. అమెరికాలో లాగా అధ్యక్షపాలనకు వెళ్లాలనే సరదా బీజేపీకి ఉన్నప్పటికీ మన రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ఆ ఆలోచనే విరుద్ధం కనుకనే.. "జమిలి ఎన్నికలు..." అనే రాగం అందుకున్నారు.

అందుకనే, ఇప్పుడు కేసీఆర్ చెప్పారనో గతంలో బీజేపీ నేతలు అన్నారనో కొత్త రాజ్యాంగ రచన కుదరదు. మరి, కేసీఆర్ ప్రకటనపై బీజేపీ, కాంగ్రెస్, ఇతర నేతలు... చానెళ్లు ఇంత అల్లరి ఎందుకు చేశాయి అంటే... అదీ ఈనాటి రాజకీయాల క్వాలిటీ.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

## గూడూరు డివిజన్ వార్తలు

### బకాయిలు చెల్లించాలి

**- కమిషనర్ శ్రీకాంత్**



బకాయిలు ఉన్న ఆస్తి, కుళాయి, ఇతర పన్నులను ప్రజలు వెంటనే చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఈ నెల 7వ తేదీ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

### పార్టీలకు అతీతంగా ఐక్యపోరాటం చేద్దాం

**పాశం సునీల్‌కుమార్**



గూడూరును జిల్లా కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించేంత వరకు పార్టీలకు అతీతంగా ఐక్యపోరాటాలు చేద్దామని మాజీఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 7వ తేదీ వివిధ పార్టీల నాయకులతో కలిసి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ కూతవేటు దూరంలో ఉన్న నెల్లూరులో కాకుండా 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో గూడూరును కలిపితే ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే అనేక సమస్యలు ఏర్పడతాయని అన్నారు. వివిధ పార్టీల నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల నాయకులు కాలేషా, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వెంకటేష్, కుమార్, భాస్కర్‌గౌడ్, పరిమల వెంకటేశ్వర్లు, జమా ఉల్లా, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.

### గురుకుల విద్యార్థులకు విద్యాసామాగ్రి



విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేస్తున్న శ్యాంయాదవ్, బాలకృష్ణంరాజు

గూడూరు మండలం గాంధీనగర్ ప్రాంతంలోని మినీ గురుకుల విద్యార్థులకు ఇటీవల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ మయూరి శ్యాంయాదవ్ దాతృత్వంతో విద్యాసామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు మయూరి శ్యాంయాదవ్ మాట్లాడుతూ చిన్నతనంలోనే విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకోవాలని మార్గనిర్దేశం చేశారు. 16 మంది విద్యార్థులకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. రోటరీక్లబ్ అధ్యక్షులు నందిమండలం బాలకృష్ణంరాజు, కార్యదర్శి సురేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో..

# రథసప్తమి



సూర్యప్రభ వాహనంలో దర్శనమిస్తున్న శ్రీ రంగనాథుడు



సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీనృసింహుడు

రథసప్తమిని పురస్కరించుకుని ఈనెల 8న జిల్లాలోని పలు ఆలయాల్లో వేడుకలు జరిగాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో స్వామివారికి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ వాహనంలో శ్రీలక్ష్మీనృసింహుడు భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చారు. స్వామివారిని వరుసగా ఏడు వాహనాలపై కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం స్వర్ణగరుడ వాహనంపై స్వామికి ఆస్థానసేవ నిర్వహించారు. శేషవాహనం, సింహవాహనం, సూర్యప్రభ-చంద్రప్రభ వాహనోత్సవాలతో పాటు బంగారు హనుమంతవాహనం, అశ్వవాహన సేవలను కన్నులపండువగా చేపట్టారు. ఆలయ ఛైర్మెన్ చెన్నుపాటి తిరుపాల్‌రెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తదితరుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో :

రథసప్తమి సందర్భంగా నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు సప్తవాహన సేవలను నేత్రపర్వంగా నిర్వహించారు. సూర్యప్రభ వాహనం, గరుడవాహనం, సింహ వాహనం, హంసవాహనం, బంగారు తిరుచ్చి, పెద్దశేష వాహనం, చంద్రప్రభ వాహనాల్లో స్వామివారిని కొలువుదీర్చి పూజలు చేశారు. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మెన్ శివకుమార్ ఆచారి, ఇ.ఓ డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

### శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో :

నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 8న రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారిని సూర్యప్రభ-చంద్రప్రభ వాహనాల్లో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

### గూడూరులో....



రథసప్తమి సందర్భంగా ఈ నెల 8వ తేదీ గూడూరు పట్టణం తూర్పువీధిలోని శ్రీ ఆంజనేయస్వామికి వారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. అలాగే గూడూరులోని శ్రీ అలగనాథస్వామి దేవాలయంలో స్వామివారు సూర్యప్రభ వాహనంపై ఊరేగి తూర్పువీధిలోని ఆరుకాళ్ళ మండపానికి చేరుకుని ప్రత్యేక పూజలు అందుకున్నారు.

# గర్భిణులకు జెవివి భోజనాలు



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టమోటా మర్చంట్ సెల్వం దాతృత్వంతో ఈ నెల 9వ తేదీ ప్రభుత్వ ఆసుపత్రిలోని నిరుపేద గర్భిణీ స్త్రీలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డాక్టర్ రాజా, యం.వి.పురం సర్పంచ్ జగదీష్ చేతులమీదుగా ఈ కార్యక్రమం జరిగింది. జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, పురుషోత్తమరావు, రాధయ్య, కటకం శ్రీను, ప్రభాకర్, ప్రసాద్, వెంకట్, విష్ణు, రుదీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 12 కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్టు

## డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



పట్టుబడ్డ నిందితులతో గూడూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు

గూడూరు డివిజన్ పరిధిలో దేవాలయాలు, ఇళ్ళలో కన్నాలు వేసి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారివద్ద నుండి సుమారు రూ.6లక్షల విలువైన 50 గ్రాముల బంగారం, 3 బైకులు, రెండు కలర్ టీవీలను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు డిఎస్పీ రాజగోపాలరెడ్డి తెలిపారు. డిఎస్పీ తెలిపిన వివరాలమేరకు గూడూరు పట్టణం చవటపాలెం ప్రాంతానికి చెందిన దుగ్గినబోయిన సాయిశివకుమార్ అలియాస్ కడపసాయి అనే నిందితుడు మూడు హత్యకేసుల్లో ప్రధానముద్దాయి. మతి స్థిమితం లేని ఓ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసిన కేసులో ప్రధాన ముద్దాయి. కడపసాయి జైలులో ఉన్న సమయంలో మనుబోలు స్టేషన్ పరిధిలో ఆలయాలలో దొంగతనం కేసులో నిందితులుగా ఉన్న తమిళనాడు ఆర్‌కే నగర్ జిల్లా తండియార్‌పేటకు చెందిన బాన డేవిడ్, గని మా బాషాలు పరిచయం అయ్యారు. వీరు ముగ్గురు ముఠాగా ఏర్పడి బెయిల్‌పై వచ్చిన తర్వాత పలు ఇళ్ళలో, దేవాలయాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలోనే సైదాపురం మండలం పాతాలపల్లి, పాలూరు, గంగదేవిపల్లి, కమ్మవారిపాలెంలో మూడు దేవాలయాల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి వేలిముద్రలను సేకరించగా వీరి ముగ్గురివే అని తేలడంతో రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు ఉమాశంకర్, బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో కైవల్యా బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకొని విచారించారు. 7 దేవాలయాల్లో హుండీలు పగలగొట్టి అందులోని రూ.18,500, దాదాపు 3.2 లక్షల రూపాయల విలువచేసే 7 దేవతా మూర్తుల బంగారు మంగళసూత్రాలు, ఇళ్ళలో దొంగతనం చేసిన బంగారం, 45వేలు విలువ చేసే వెండి వస్తువులు, మూడు బైకులు, రెండు కలర్‌టీవీలు మొత్తం 6 లక్షలు విలువచేసే వస్తువులను దొంగతనం చేయగా, వారి వద్ద నుండి రూ.4,75,500లను రికవరీ చేసినట్లు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రధాన నిందితుడు సాయి శివకుమార్‌ను అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర వహించిన రూరల్ సిఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సైలు బ్రహ్మనాయుడు, ఉమాశంకర్, కానిస్టేబుల్ రాజు, రహీమ్, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం తదితరులకు రివార్డులు అందించారు.

# అపురూపమైన ఆలయం..'పడారుపల్లి' శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని దేవస్థానం

*'వేంకటాద్రి సమం స్థానం..*
*బ్రహ్మాండే నాస్తి కించన!..*
*వేంకటేశ సమో దేవో..*
*న భూతో న భవిష్యతి'...*

***అంటున్నాయి మన వేదాలు, ప్రాచీన గ్రంథాలు. ఈ కలియుగంలో భక్తులందరికీ ప్రత్యక్షదైవం ఆ తిరువేంకటాధీశుడే. అందుకే తిరుమలేశుని నిరంతరం భక్తితో సేవించుకునేందుకు తమప్రాంతాల్లోనూ భక్తులు ఎన్నోచోట్ల శ్రీ వేంకటేశ్వరుని దేవాలయాలు నెలకొల్పుకున్నారు. ఆపద్బాంధవుడు, భక్తాభీష్టప్రదాయకుడైన ఆ స్వామివారికి నెల్లూరు జిల్లాలోనూ అక్కడక్కడా గొప్ప ఆలయాలున్నాయి. అలాంటివాటిలో మరో అపురూపమైన ఆలయం..నెల్లూరులోని పడారుపల్లిలో కొలువైవున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరుని దేవస్థానం. ఈ ఆలయం ఇటీవలికాలంలో నిర్మించినదే అయినా ఎంతో మనోహరంగా ఉండడంతో పాటు, స్వామిని దర్శించుకున్నవారి ఆకాంక్షలు ఫలిస్తుండడంతో స్వల్పకాలంలోనే సుప్రసిద్ధమైన ఆలయంగా ప్రసిద్ధిలోకి వచ్చింది. భక్తుల కొంగుబంగారంగా వెలసిన ఈ ఆలయంలో అనేక ప్రత్యేకతలున్నాయి. ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు ఆసక్తికరమైన కథనాలు కూడా ఉన్నాయి.***

కొన్నేళ్ళ క్రితం.. జిల్లాలోని పొదలకూరు మండలం ముదిగేడు గ్రామానికి చెందిన దుద్దుగుంట కృష్ణారెడ్డి అనే పేదరైతు జీవనోపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్ళి వ్యాపారం చేసుకునేవారు. ఆయన శ్రీ వేంకటేశ్వరునికి పరమభక్తుడు కూడా. అందుకే స్వామివారి కరుణాకటాక్షంతో వారి వ్యాపారం దినదినాభివృద్ధి చెందింది. దీంతో ఏటా వచ్చే ఆదాయంలో కొంతభాగాన్ని శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్ళే కొంతమంది భక్తులకు వెచ్చించేవారు. ఆయనే స్వయంగా అన్ని ఖర్చులూ పెట్టుకుని ఆ భక్తులను తిరుమలకు తీసుకువెళ్ళి శ్రీవారి దర్శనం చేయించేవారు కూడా. అలా ఎంతోకాలంగా జరుగుతుండేది. కొంత





## మన దేవాలయాలు (86)

కాలానికి తానే శ్రీవారికి ఆలయాన్ని నిర్మిస్తే తమతో పాటు భక్తులందరికీ కూడా నిత్యం స్వామివారి దర్శనానికి వీలుంటుంది కదా.. అనే ఆలోచన వచ్చింది. అనుకున్నదే తడవుగా 1995 ఏప్రిల్‌లో నెల్లూరుకు వచ్చి పడారుపల్లి వద్ద విశాలమైన స్థలాన్ని కొనుగోలు చేసి శ్రీ వేంకటేశ్వరుని ఆలయాన్ని అద్భుతంగా నిర్మాణం గావించారు. గర్భాలయంలో ఎంతో ప్రసన్నవదనంతో ఉండే శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టును భక్తులు సాక్షాత్తూ ఆ తిరుమలేశునే దర్శించుకుంటున్నామన్నంత సంతృప్తి కలిగేలా కాంచీపురం శిల్పులతో రూపుదిద్దించారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను కూడా కొలువుదీర్చారు. సర్వాంగసుందరంగా ఆలయాన్ని నిర్మించి స్వామివారికి అమ్మవార్లకు పూజలు, సేవలు ప్రారంభించి కృష్ణారెడ్డి దంపతులు తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. ఆ తర్వాత కొంతకాలానికి కృష్ణారెడ్డి 94సంవత్సరాల పాటు పరిపూర్ణ జీవితం గడిపి పరమపదించారు. అయినప్పటికీ కృష్ణారెడ్డి, ఆయన సతీమణి రావమ్మ పుణ్య దంపతుల భక్తికేతనంగా పడారుపల్లిలో ఈ ఆలయం చిరస్థాయిగా నిలిచిపోయింది. ప్రస్తుతం వారి కుమారుడు, శ్రీ వేంకటేశ్వరుని భక్తుడు, తండ్రికి తగ్గ తనయుడైన దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి (23వ డివిజన్ వైకాపా కార్పొరేటర్)తో పాటు, వారి అల్లుడు సోమల శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణంతా ఏ కొరతా లేకుండా వైభవోపేతంగా జరుగుతోంది.

### 27 అడుగుల భారీ గరుడ, అభయ వీరాంజనేయ విగ్రహాలు :

తిరుపతిలోని అలిపిరి వద్ద ఉన్న భారీ గరుడ విగ్రహాన్ని తలపించేవిధంగా అద్వితీయమైన రీతిలో ఈ ఆలయం ముంగిట 27 అడుగుల గరుడ విగ్రహమూర్తి నిర్మాణం ఎంతో అద్భుతంగా ఉంటుంది. అదేవిధంగా ఇటీవలే నిర్మించిన మరో 27 అడుగుల శ్రీ అభయ వీరాంజనేయస్వామి విగ్రహమూర్తి కూడా అందరినీ భక్తిపారవశ్యులను చేస్తుంటుంది. శ్రీ వేంకటేశ్వరుని ఆలయం ముంగిట ఇలా ఇంత భారీ గరుడ, ఆంజనేయస్వామిల విగ్రహాలు ఉండడం ఎంతైనా అరుదే. అంతేకాదు, ఈ ఆలయానికి ఉపాలయాలుగా నవగ్రహ మండపం ఉండడం మరో ప్రత్యేకత.

### నిత్యపూజలు, విశేష సేవలు :

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి నిత్యపూజలు, అభిషేకాలు, సేవలతో పాటు ప్రతిఏటా దసరా, నవరాత్రి ఉత్సవాలు, కార్తీకమాసంలో విశేషపూజలు జరుగుతుంటాయి. ఆలయ నిర్వాహకుల సారథ్యంలో, అర్చకుడు పంచాంగం కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారి పూజలు వైభవంగా జరుగుతూనే ఉన్నాయి. ఏదేమైనా.. పడారుపల్లి కల్యాణ వేంకటేశ్వరుని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతుండడం, సంతానం లేనివారికి సంతానం, పెళ్ళికానివారికి వివాహం జరుగుతుండడంతో ఆలయానికి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తుండడం విశేషం.

# కల్యాణ వైభవం...!

సుమంత్ - అనూష



దగదర్తి మండలం, శ్రీరామపురం వాస్తవ్యులు తుంగా వెంకటరమణారెడ్డి - శ్రీవాణిల కుమారుడు **సుమంత్‌కుమార్‌రెడ్డి - అనూష**ల కల్యాణం ఫిబ్రవరి 5వ తేదీ వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

ఆదర్శ్ - కవిత



ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి అనుముల జయప్రకాష్ - శకుంతలల కుమారుడు **డా॥ ఆదర్శ్ - కవిత**ల పరిణయం ఫిబ్రవరి 5వ తేదీ ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# కమలంలో కలవరం

(మొదటి పేజీ తరువాయి)

కలిసివస్తాయని ఊహించని బీజేపీ పెద్దలు ఖంగుతిన్నారు. తెలంగాణ బీజేపీ నేతలు బండి సంజయ్, ధర్మపురి శ్రీనివాస్ తదితరులు అయితే, మోదీ చెప్పిన విషయంలో తప్పేముంది అంటూ సమర్ధించుకోడానికి నానా తిప్పలూ పడుతున్నారు.

ఆయాచితంగా లభించిన ఈ అపూర్వ అవకాశాన్ని కేసీఆర్ అంత తేలికగా వదిలే సూచనలు కనపడడం లేదు. తెలంగాణ ప్రజలను, ఉద్యమాన్ని మోదీ అవమానపరిచారని తెలంగాణ సమాజానికి ఆయన క్షమాపణలు చెప్పాలని ఆయన ఇప్పటికే తమ పార్టీ శ్రేణుల చేత మాట్లాడిస్తున్నారు.

విభజన జరిగిన ఏడెనిమిది ఏళ్ల తరువాత, మోదీ ఈ విషయాన్ని ప్రస్తావించి ఉండాల్సింది కాదనే వ్యాఖ్యానాలు రాజకీయవర్గాలలో వినిపిస్తున్నాయి. అయితే ఇందుకు కారణాలూ లేకపోలేదు.

తెలుగు సమాజాన్ని అసంబద్ధంగా... అసహజంగా విభజించడంలో కాంగ్రెస్‌కు ఎంత పాత్ర ఉందో... బీజేపీకీ అంతే పాత్ర ఉంది. నిజానికి కాంగ్రెస్ కంటే బీజేపీకే ఎక్కువ బాధ్యత ఉంది. విభజన బిల్లు ఆమోదించి, కాంగ్రెస్ శంకరగిరి మాన్యాలు పట్టిపోతే బీజేపీ అధికారంలోకి(అంటే మోదీ అధికారంలోకి) వచ్చిన తరువాతే తెలుగు రాష్ట్ర విభజన జరిగింది. విభజన బిల్లుకు పార్లమెంట్‌లో బీజేపీ కూడా బేషరతు మద్దతు ఇచ్చినందున విభజన చట్టాన్ని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన బాధ్యత కూడా బీజేపీపై ఉంది. కానీ, తెలుగు రాష్ట్రాలపై మోదీకి ఉన్న చిన్నచూపు ఫలితంగా ఏ ఒక్క హామీని అమలులోకి తీసుకు రాలేదు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా మంజూరు చేయలేదు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినా... దానిని పూర్తిచేయలేదు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేయలేదు. ఆంధ్రకు రాజధాని ఏమిటో తేల్చలేదు. ఈ రెండు రాష్ట్రాలనూ అసమంజసంగా ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్‌కు ఎంత దుర్బుద్ధి ఉందో విభజనకు ఇతోధికంగా... శక్తి కొద్దీ సహకరించి కూడా, విభజన చట్టం అమలు చేయకుండా తొక్కిపెట్టి ఉంచడంలో బీజేపీకి కూడా అంతటి దుర్బుద్ధి ఉందనే విమర్శలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఎదుర్కొంటూనే ఉంది.

అయినప్పటికీ తెలంగాణ ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ ఒక్కటే తప్పుచేసినట్టుగా మోడీ మాట్లాడడం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది.

మోడీ చేసిన ఈ వ్యాఖ్యలు, తెలంగాణలో బీజేపీకి ఆత్మహత్యా సదృశంగా పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే టీ-బీజేపీ నోటి కంటే, టీఆర్ఎస్ నోరు పెద్దది. కార్యకర్తల బలగం పెద్దది. తిమ్మిని బమ్మిగా ప్రచారం చేయడంలో టీఆర్ఎస్‌ను మించినవారు లేరన్నది అక్షర సత్యం.

రామానుజులవారి వెయ్యేళ్ళ పండుగకు వచ్చి నాలుగుగంటల పాటు భక్తి పారవశ్యంతో పులకరించారు ప్రధాని మోడీ. ఈ పర్యటన తెలంగాణ కమలానికి కొత్త వూతం ఇచ్చిందని అందరూ భావించారు. అంతలోనే గాడి తప్పి మోడీ చేసిన విమర్శ పెద్ద దుమారాన్నే రేపుతోంది. ఈ ఒక్క సంఘటనతో ముచ్చింతల్ పర్యటనంతా గాలిలో కలిసి, కారు కింద కమలం నలిగిపోతుందని విశ్లేషకుల అంచనా.

# తగ్గిందెవరు.. నెగ్గిందెవరు?

(మొదటి పేజీ తరువాయి)

లంచగొండిపరులుగా, బద్ధకస్తులుగా చిత్రీకరించి వ్యవహారాన్ని రాజకీయం చేసేశారు. ఉద్యోగులు అపరిపక్వతతో వ్యవహరిస్తున్నారంటూ వారి అహం దెబ్బతినేలా ప్రకటనలిచ్చారు. 'చలో విజయవాడ' కార్యక్రమానికి అనవసర ప్రాధాన్యతను ఇచ్చి భారీ ప్రచారం కల్పించారు. ఫలితంగా 5వేల మందితో జరపాలనుకున్న సభను లక్షమందితో జరిపేలా ఉద్యోగులను ప్రేరేపించారు.

## తగ్గిందెవరు... నెగ్గిందెవరు..?

పరస్పరం వివాదాస్పద వాక్బాణాలు, విమర్శలు ప్రతివిమర్శలు చేసుకున్న తరువాత లాభపడింది ఎవరు? విజయవాడ సభ అనంతరం జరిగిన చర్చలలో తగ్గిందెవరు.. నెగ్గిందెవరు? ప్రభుత్వమే తగ్గుంటే కొత్తగా ఇప్పుడు ఉపాధ్యాయుల గోడు తెరపైకి వచ్చి ఉండేది కాదు. అలాగని ఉద్యోగులే తగ్గుంటే వారి పోరాటానికి పూర్తిగా పరిష్కారం లభించనట్లే. కారణం ఏదైనా ప్రభుత్వం తొలివిడత చర్చలలో ప్రకటించినట్లుగా పదవీ విరమణ పరిమితి మాత్రం 62 సంవత్సరాలకు పెరిగింది. మలివిడత చర్చలలో ఇద్దరూ ఒక మెట్టు దిగారని చెప్పొచ్చు. నిన్నటివరకు హీరోలుగా ఉన్న ఉద్యోగ సంఘ నాయకులు ఇప్పుడు కొన్ని వర్గాల దృష్టిలో జీరోలుగా మారారు. మొన్నటివరకు దుర్మార్గపు ప్రభుత్వంగా కనపడిన కొంతమంది దృష్టిలో జగన్‌మోహన్‌రెడ్డి కనిపించే దైవంగా అవతరించారు. కాబట్టి ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తే అటు ప్రభుత్వం, ఇటు ఉద్యోగులూ ఎవరూ తగ్గలేదు, ఎవరూ నెగ్గలేదు. ఇద్దరూ సంయమనం పాటించి తాత్కాలికంగా సమస్యకు తెరదించారని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు.

# నాట్యకళ.. మన వారసత్వ సంపద



నృత్య పోటీల విజేతలకు అవార్డు అందిస్తున్న అతిథులు

నాట్యకళ మన దేశ వారసత్వ సంపద అని, ఆ కళను అందరం పరిరక్షించుకోవాలని కోలాటం జానపద కళల సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ప్రసన్నలక్ష్మి అన్నారు. ఇటీవల నెల్లూరులోని డ్యాన్స్ డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ 30వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు టౌన్‌హాలులో శాస్త్రీయ నృత్యపోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె నాట్యకళలో ఎంతో మందికి శిక్షణ ఇస్తున్న డ్యాన్స్ డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకుడు ఎస్‌కె బాబు కృషి ఎంతో అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథులుగా సినీనటి ప్రభావతి, సినీ నిర్మాత నరేష్‌వర్మ, స్వర్ణా వెంకయ్య, ఖాజావలి, మోడరన్ బిల్డర్స్ నాగరాజు, అందే శ్రీనివాసులు తదితరులు పాల్గొని నాట్యకళ విశిష్టతను వివరించారు.


## కాలధర్మం

### మన్నెమాల వెంకురెడ్డి



సౌమ్యశీలి, స్నేహశీలి, మృదుభాషి మన్నెమాల వెంకురెడ్డి ఫిబ్రవరి 8వ తేదీ మంగళవారం రాత్రి తమ 62వ ఏట బెంగళూరులో కన్నుమూశారు. ఆయనకు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. నెల్లూరుజిల్లా మైపాడు ప్రాంతం నరసాపురం వెంకురెడ్డి స్వగ్రామం. మన్నెమాల రాజగోపాలరెడ్డి - అహల్యమ్మల ఏకైక మగ సంతానంగా రైతు కుటుంబంలో జన్మించారు వెంకురెడ్డి. వెంకురెడ్డి నాన్న రాజగోపాలరెడ్డి కూడా అయిదు పదుల వయస్సులోనే దివంగతులయ్యారు. విద్యాభ్యాసం అనంతరం బెంగళూరులో రియల్‌ఎస్టేట్, నిర్మాణరంగాలవైపు దృష్టి సారించారు. 4 దశాబ్దాల క్రితమే ఆయన తన వ్యాపార ప్రస్థానాన్ని బెంగళూరులో ప్రారంభించి అపారకీర్తితో పాటు ఎనలేని సిరిసంపదలను కూడా తన స్వంతం చేసుకున్నారు. వెంకురెడ్డిది బాగా కష్టపడే నైజం. ఎవ్వరినీ నొప్పించని స్వభావం. తన సమీప బంధువులందరికీ అండగా నిలిచి పైకి తీసుకొచ్చారు. ఆయనకు ఒకసారి పరిచయమైతే ఇక వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. వెంకురెడ్డికి తల్లి అహల్యమ్మ, చెల్లెళ్ళు పుష్ప, శైల, భార్య ప్రతిభ, కుమారుడు శివచరణ్, కుమార్తె ముక్తి ఉన్నారు. చిన్న వయసులోనే అత్యున్నత స్థానాన్ని అధిరోహించి అందరి ఆదరాభిమానాలను చూరగొన్న వెంకురెడ్డి ఆకస్మిక మరణం ఆయన కుటుంబసభ్యులతో పాటు ఆయన మిత్రులను కూడా షాక్‌కు గురిచేసింది. మంచితనం, మానవీయత కలిగిన కుటుంబ పెద్దని కోల్పోయి దుఃఖసాగరంలో ఉన్న వెంకురెడ్డి కుటుంబసభ్యులకు మనోస్థైర్యాన్ని, గుండెనిబ్బరాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తూ... వెంకురెడ్డి మృతికి నివాళులర్పిస్తోంది 'లాయర్'.

### జక్కా జానకమ్మ



నెల్లూరుజిల్లాలో మొట్టమొదటి ఆటో ఫైనాన్స్ సంస్థను ప్రారంభించిన వ్యాపారవేత్తగా, రోటరీక్లబ్‌తో పాటు పలు ధార్మిక సేవా సంస్థలకు అండగా నిలచిన సంఘ సేవకుడిగా, శ్రీ కస్తూరిదేవి విద్యా సంస్థల సెక్రటరీ మరియు కరస్పాండెంట్‌గా సుదీర్ఘ కాలం పనిచేసిన విద్యావేత్తగా నెల్లూరీయులకు సుపరిచితులైన స్వర్గీయ జే.వీ.రెడ్డి సతీమణి శ్రీమతి జక్కా జానకమ్మ ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి కన్నుమూశారు. జానకమ్మ టంగుటూరు వారి ఆడపడుచు. కుడితిపాళెం వాస్తవ్యులు లక్ష్మీనరసారెడ్డి - సరస్వతమ్మల మూడవ సంతానంగా 1938లో జన్మించారు జానకమ్మ. ఆ రోజుల్లోనే ఆమె మద్రాసులో సుబ్బారావు అవెన్యూలోని 'పచ్చప్ప కాన్వెంటు'లో బాల్య విద్యాభ్యాసం చేశారు. 1956లో జక్కా వెంకటరామిరెడ్డి(జే.వీ.రెడ్డి)ని పరిణయమాడారు. జానకమ్మ జే.వీ.రెడ్డి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె కాగా.. కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి చాలాకాలం క్రితమే కాలం చేశారు. కుమార్తె శరణ్య అమెరికాలో స్థిరపడిపోయారు. జే.వి.రెడ్డి కూడా గత ఏడాది దివంగతులయ్యారు.

కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతుండిన జానకమ్మ తన 84వ యేట పతి చెంతకు చేరారు. జానకమ్మ మృతికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# నెల్లూరులో వెల్లువెత్తిన నిరసనలు

## ○ సమస్యలు తీర్చాలంటూ పెద్దఎత్తున ఆందోళనలు



విఆర్‌సి కూడలి వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న కార్మికులు



విద్యుత్‌భవన్ ఎదుట నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

పిఆర్‌సిపై ఉద్యోగులకు అన్యాయం చేస్తూ జేఏసి నేతలు సమ్మె విరమించడాన్ని వ్యతిరేకిస్తూ నెల్లూరులోని మునిసిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు చేసిన నిరసనలు, మరోవైపు ఉపాధ్యాయసంఘాల వారు, విద్యుత్‌శాఖ వారు చేస్తున్న ఆందోళనలతో నెల్లూరు అట్టుడికిపోయింది. ఈ నెల 7న నగరంలోని గాంధీబొమ్మకూడలి వద్ద నుంచి విఆర్‌సి కూడలి దాకా మునిసిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మోకాళ్ళపై కూర్చొని ఆందోళన చేశారు. దీనిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తవాతావరణం ఏర్పడింది. అనేక మందిని పోలీసులు బలవంతంగా అరెస్టులు కూడా చేశారు. తోపులాటలో పలువురు మహిళలకు కూడా గాయాలయ్యాయి. సిఐటియు నాయకులు టివివి ప్రసాద్, అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు, అల్లాడి గోపాల్, మాలకొండయ్య, కొండా ప్రసాద్‌తో పాటు 50 మంది మునిసిపల్ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టిడిపి నాయకులు వచ్చి గట్టిగా ప్రశ్నించేసరికి కొద్దిసేపటి తర్వాత వారిని వదిలిపెట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇది నిరంకుశ ప్రభుత్వమంటూ ప్రభుత్వం వైఖరిని విమర్శించారు. పారిశుద్ధ్య కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేయడం పాపమా అని ప్రశ్నించారు. బాలాజీనగర్‌లోని సిపిఎం కార్యాలయం నుంచి కొద్దిదూరం ర్యాలీ నిర్వహించిన సిపిఎం నాయకుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అడుగుతున్న పారిశుద్ధ్య కార్మికులను అరెస్ట్‌చేయడం దారుణమన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల నినాదాలు :

తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలంటూ నెల్లూరులోని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఈనెల 7న భోజన విరామసమయంలో రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేశారు. ఏళ్ళ తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తీర్చాలన్నారు. రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు నగరంలోని విద్యుత్‌భవన్ ఎదుట విద్యుత్ జేఏసి నాయకులు, ఉద్యోగులు, కార్మికులు నిరసనలు చేపట్టారు. విద్యుత్ జేఏసి రాష్ట్ర నాయకులు శేషారెడ్డి, అల్తాఫ్, డిస్కం నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కోవిడ్ వల్ల మృతిచెందిన వారి కుటుంబాలకు 50 లక్షల వంతున నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నామన్నారు.

### ఉపాధ్యాయుల ఆందోళన :

కొత్త పిఆర్‌సిని వ్యతిరేకిస్తూ నెల్లూరులో పలు ఉపాధ్యాయసంఘాల నాయకత్వంలో ఉపాధ్యాయులు ఈనెల 7న పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. వేలాదిమంది ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. పిఆర్‌సిపై మంత్రుల కమిటీతో పిఆర్‌సి సాధనసమితి నాయకులు చేసుకున్న నల్ల ఒప్పందాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఫిట్‌మెంట్ లేకుండానే ఒప్పందం కుదుర్చుకున్నారని, హెచ్‌ఆర్‌ఏ శ్లాబ్‌లతో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఉపాధ్యాయులు నష్టపోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు దళారి నాయకులు ఉద్యమాన్ని తాకట్టుపెట్టారని, లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారులను నమ్మించి నట్టేటముంచారని వారు ఆందోళనతో నిరసనలకు దిగారు. న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు.

## రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి గౌరవ సలహాదారుగా

# గొలగమూడి ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు పొదలకూరురోడ్డులో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ ఆసుపత్రి గౌరవ సలహాదారునిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.బాలసుబ్రహ్మణ్యం ఈనెల 7న బాధ్యతలు స్వీకరించారు. క్యాన్సర్ ఆసుపత్రిలో అన్ని విభాగాలను ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో మరింత మేలైన సౌకర్యాల కల్పనకు, నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషిచేస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

అంతకు ముందు రోజు రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు నెల్లూరులో రెడ్‌క్రాస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి బాలసుబ్రహ్మణ్యం నియామకంతో రెడ్‌క్రాస్ ఆసుపత్రికి మంచిరోజులు రానున్నాయని చెప్పారు. రెడ్‌క్రాస్‌కు బ్లడ్ బ్యాంకు, పినాకిని గాంధీ ఆశ్రమం, స్పాస్టిక్ సెంటర్, వైఆర్‌జీ కేర్, తలసేమియా డే కేర్ సెంటర్, యాంటిరాబిస్ వ్యాక్సిన్ సెంటర్, జనరిక్ మందుల షాప్, శీతల శవ పేటికల విభాగం మరియు క్యానర్ హాస్పిటల్‌తో పాటు మొత్తం 13 విభాగాలు ఉన్నా యని, క్యాన్సర్ హాస్పిటల్‌లో రోగులకు105 పడకలు ఉన్నాయని, ప్రస్తుతం సమాజంలో క్యాన్సర్ వ్యాధి విస్తృతంగా విస్తరిస్తూ అనేక మంది పేదలు క్యాన్సర్ బారిన పడుతున్న నేపథ్యంలో క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి సమర్థవంతమైన అధికారిగా బాలసుబ్రహ్మణ్యం తమ సేవలందించనున్నారని తెలిపారు ఆ హాస్పిటల్‌ను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని, అందువల్ల సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని హాస్పిటల్‌కు గౌరవ సలహాదారుగా నియమించడం జరిగిందన్నారు. తన విజ్ఞప్తిమేరకు జిల్ల కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం ఆయన నియామకం జరిగిందని, అందుకు ఆయన అంగీకారం తెలియజేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇది నెల్లూరు రెడ్‌క్రాస్ ప్రతిష్టను మరియు గౌరవాన్ని మరింత పెంపొందించే శుభ పరిణామమన్నారు. ఆంధ్రరాష్ట్రంలోనే అత్యంత నిజాయితీ కలిగిన ఐఏఎస్ అధికారులలో ప్రముఖ సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.బాలసుబ్రహ్మణ్యం ఒకరని, గతంలో తిరుమల తిరుపతి దేవస్థానంలో జెఇఓగా తొమ్మిదిన్నర సంవత్సరాల సుదీర్ఘకాలం పాటు పనిచేసి టిటిడి అభివృద్ధికి విశేషంగా కృషిచేశారని పేర్కొన్నారు. టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా, టాటా సునామీ రిలీఫ్ ఫండ్ రిహాబిలిటేషన్ సెంటర్ డైరెక్టర్‌గా ఆయన ఉచితసేవలందించారని, ఆ కారణంగా టాటా కంపెనీ వారు కోటి రూపాయలను గొలగమూడి ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారన్నారు. ప్రస్తుతం గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి దేవాలయం కార్య నిర్వహణాధికారిగా ఉంటూ ఆలయ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అపారమన్నారు. దేవస్థానం ఇఓగా ఆయనెన్నో అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు పలువిధాలైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి అభినందనలు అందుకుంటున్నారని, అలాంటి అధికారి క్యాన్సర్ ఆసుపత్రికి గౌరవ సలహాదారుగా నియమితులు కావడం ఎంతైనా హర్షదాయకమన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పనిచేసే నిజాయితీ అధికారి నెల్లూరు రెడ్‌క్రాస్ కాన్సర్ ఆసుపత్రికి గౌరవ సలహాదారుగా ఉచితంగా సేవ చేయడానికి అంగీకరించడం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా కమిటీ విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ చక్రదర్‌బాబు ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగిందని చంద్రశేఖర్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమావేశంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు బయ్యాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అలవి వలలతో...

# మా పొట్టలు కొడుతున్నారు

## ➢ సోమశిల జలాశయం మత్స్యకారులు ఆవేదన



సోమశిల జలాశయం ఆధారంగా బతుకుతున్న మత్స్యకారుల జీవన పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఈ జలాశయం పరిధిలోని గుర్తింపు పొందిన జాలర్లు ఏరోజుకారోజు చేపల వేటకు వెళ్ళి, వచ్చిన మత్స్య సంపదతో జీవనం సాగిస్తుంటారు. అయితే ఆ మత్స్యకారుల పరిస్థితి అలవి వలలతో అధ్వాన్నంగా మారుతోంది. సంవత్సరంలో దాదాపు మూడు నెలల పాటు చేపల వేట నిషేధం ఉండడం, మూడు నెలలపాటు వర్షాకాల ప్రభావంతో వేటకు వెళ్లకపోవడం, మిగిలిన ఆరునెలల్లోనే వారి జీవనం సాగుతూ ఉండడం అందరికీ తెలిసిందే. అయితే ఆ తెచ్చిన చేపలను కూడా ఇక్కడ వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి వారికి అతితక్కువ ధరలోనే కొనుగోలు చేస్తుండడం దారుణం. అంతేకాదు, కొంతమంది చేపల విక్రయ మాఫియా ముఠాగా ఏర్పడి బయట రాష్ట్రం నుండి కూలీలను తెచ్చి మత్స్యకారులు రాక్షస వల అని పిలువబడే ప్రభుత్వం నిషేధించి ఉన్న అలవి వలలను జలాశయంలో లోతట్టు భాగంలో ఏర్పాటు చేసి భారీగా మత్స్య సంపదను కొల్లగొట్టి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారంటూ స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఆ మాఫియాతో పోటీపడలేక, చేపల వేటకు వెళ్ళినప్పుడు చేపలు దొరకక తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని, ఇకనైనా అధికారులు కలగజేసుకుని అలివి వలలను జలాశయంలో చేపలు పట్టేందుకు వీలులేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై వారు ఇటీవల ధర్నాందోళన నిర్వహించారు. చిన్న సన్నకారు మత్స్యకారులకు తగు న్యాయం చేయాలంటూ సోమశిల జలాశయం వద్ద నినాదాలు చేశారు. ఇప్పటికే స్థానిక అధికారులకు, జిల్లా అధికారులకు ఈ ఆలవి వలల విషయమై ఫిర్యాదు చేసి ఉన్నా కూడా అధికారులు పట్టించుకోలేదని వారు ఇప్పటికైనా వాటిని నిరోధించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



## ధర్మ రక్షణకే...

# ధర్మపథం

ఎంతో విశిష్టమైన మన సనాతన ధర్మాన్ని పరిరక్షించుకునేందుకే రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో దర్మపథం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ మన ధర్మాన్ని కాపాడుకునేందుకు కంకణబద్ధులు కావాలని జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయం ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు కోరారు. ధర్మపథం ద్వారా పేద కళాకారులను ఆదుకుంటున్నామన్నారు. ఈనెల 7న జొన్నవాడ ఆలయంలో ప్రభుత్వ ఆదేశాలతో ధర్మపథం కార్యక్రమం నిర్వహించారు. తొలుత చిన్నారులతో యోగ, సూర్యనమస్కారాలు చేయించారు. ఆ తర్వాత తెనాలి కళాకారుల ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత నృత్యకార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఇఓ ఏవి శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులతోపాటు ధర్మపథం కోఆర్డినేటర్ మాణిక్యేశ్వర్, ఆయుర్వేద డాక్టర్ రాజేశ్వరమ్మ, బుచ్చిరెడ్డిపాళెం కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడలో గోశాల నిర్మాణానికి..

# రూ. 5 లక్షల వితరణ




విరాళాన్నందజేస్తున్న దాత బండి వేణుగోపాల్‌రెడ్డి

జొన్నవాడలో కొలువై ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లికార్జున సమేత శ్రీ కామాక్షి తాయి అమ్మవారి ఆలయ గోశాల ఏర్పాటుకు రాపూరుకు చెందిన బండి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి పద్మావతమ్మ, వారి కుమారుడు బండి వేణుగోపాల్‌రెడ్డి, కోడలు హరిత ఉమ్మడిగా 5 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని వేణుగోపాల్‌రెడ్డి ఆలయ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడుకు అందజేశారు. ఆలయ నిర్వాహకులు దాతలను స్వాగతించి పూజలు చేయించారు. స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించారు. ఆలయ ఇ.ఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

# భగవత్ రామానుజుల సేవలో తరించిన అతిరథ మహారథులు



హైదరాబాదు, ముచ్చింతల్‌లోని సమతామూర్తి ప్రాంగణంలో 216 అడుగుల భారీ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం భగవద్రామానుజుల స్వామివారికి పూజలు చేస్తున్న ప్రధాని మోడీ



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రామానుజుల ప్రతిమను బహుకరిస్తున్న శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి



భగవద్రామానుజుల స్మారక ప్రాంగణాన్ని చినజీయర్ స్వామితో కలిసి సందర్శిస్తున్న ఏపి సిఎం వై.యస్.జగన్, పక్కన టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి - స్వర్ణమ్మ దంపతులు

## పిఎస్‌ఎల్‌వి-సి52 ప్రయోగానికి రెడీ

శ్రీహరికోట నుండి పిఎస్‌ఎల్‌వి-సి52 రాకెట్ ప్రయోగ సన్నాహాలు పూర్తికావచ్చాయి. ఈనెల 14వ తేది ఉదయం 5.59 గంటలకు ప్రయోగ ముహూర్తం నిర్ణయించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్‌ఎల్‌వి)-సి52 రాకెట్ నింగిలోకి దిగ్విజయంగా దూసుకువెళ్లేందుకు శాస్త్రవేత్తలు రేయింబవళ్ళు కృషిచేస్తున్నారు. ఈ ప్రయోగం కోసం ఇప్పటికే వాహకనౌక అనుసంధానం కూడా పూర్తయింది.



సిద్ధమవుతున్న పిఎస్‌ఎల్‌వి-సి52

### 13 వేకువ నుంచి కౌంట్‌డౌన్ :

ఈ రాకెట్ ప్రయోగానికి ఈనెల 13 వేకువన 4.29 గంటల నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. పిఎస్‌ఎల్‌వి-సి52 ద్వారా 1710 కిలోగ్రాముల బరువున్న భారతీయ భూ పరిశీలన ఉపగ్రహం ఇఓఎస్-04 ఉపగ్రహంతో పాటు ఐఎన్‌ఎస్ 2 టిడి, ఐఎన్‌ఎస్ 2బి అనే మరో రెండు మినీ ఉపగ్రహాలను కూడా అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో అంతరిక్షరంగంలో అనేక విజయాలతో తమ ప్రతిభాపాటవాలను చాటుకుంటున్న ఇస్రో, గత కరోనా ప్రభావంతో రాకెట్ ప్రయోగాలకు కొంత ఆటంకాలు కలిగినా, అన్ని పరిస్థితులను అధిగమిస్తూ ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ఉత్సాహంతో ఈ రాకెట్ ప్రయోగానికి సిద్ధమయ్యారు. పిఎస్‌ఎల్‌వి అంటేనే షార్‌కు తిరుగులేని రామబాణం వంటిది. విజయం తథ్యమన్నది అనేక ప్రయోగాల ద్వారా తెలిసిందే. ఈ ఏడాది తొలి రాకెట్‌గా పిఎస్‌ఎల్‌వి సీరీస్‌లో పిఎస్‌ఎల్‌వి సి-52ని సిద్ధం చేయడం విశేషం.

### ఆగస్టులో చంద్రయాన్-3

ఈ ఏడాది కనీసం 7 రాకెట్లను షార్ నుంచి ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నట్లు కూడా సమాచారం. ఈ సంవత్సరం ఆగస్టులో చంద్రయాన్-3 ప్రయోగం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రయాన్‌తో పాటు గగన్‌యాన్-1 ప్రయోగాలకు సంబంధించిన రాకెట్లు కూడా సిద్ధం చేయాలని ఇస్రో భావిస్తోంది. చంద్రునిపై పరిశోధనలు జరిపేందుకు గతంలో చంద్రయాన్-2 ద్వారా పంపిన లాండర్, రోవర్ దించే ప్రయత్నంలో దురదృష్టవశాత్తూ చివరి రెండు నిమిషాల్లో ల్యాండర్ విఫలం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరలోనే ల్యాండర్‌ను, రోవర్‌ను మరోసారి పంపేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ల్యాండర్‌కు సంబంధించి కొంతమేరకు రూపకల్పన కూడా చేసినట్లు ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ఇటీవల బెంగుళూరులో తెలిపారు.

## అన్నదాతలకు మెరుగైన సేవలందిస్తున్న ప్రభుత్వం

### 'కిసాన్‌మేళా'లో కలెక్టర్, ఎమ్మెల్యే కిలివేటి



రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్నదాతలకు మెరుగైన సేవలందిస్తామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. నెల్లూరు నగరంలోని వ్యవసాయ పరిశోధనస్థానంలో ఈనెల 9న పెద్ద ఎత్తున 'కిసాన్‌మేళా' జరిగింది. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు సూళ్ళూరుపేట ఎమ్మెల్యే.. ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యులు కిలివేటి సంజీవయ్యతో కలసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని, ప్రతిరైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితర వ్యవసాయ సామగ్రి అందజేసేందుకు జిల్లాలో 668 రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటుచేసిందని తెలిపారు. రైతుల కోసం ఎన్నో రకాల పథకాలను ప్రభుత్వం అమలుచేస్తోందని కలెక్టర్ అన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ప్రతిరైతు వ్యవసాయాన్ని పండుగలా చేసుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయరంగం అభివృద్ధికి, రైతుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తున్నారని కొనియాడారు. జేసీ హరేందిరప్రసాద్, విశ్రాంత ప్రధాన శాస్త్రవేత్త డా.వి చెంగారెడ్డి, గుంటూరు ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డా.పి రాంబాబు, డా. ఎల్ ప్రశాంతి, డా. పి రాజశేఖర్ (తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం), వ్యవసాయశాఖ జేడీ ఆనందకుమారి, నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డా.యు వినీత తదితరులు పాల్గొన్నారు.


లాయర్
విజయపథంలో నెల్లూరీయులు




కాఫీటేబుల్ బుక్ కొరకు
9246431984 నెంబరుకు
గూగుల్‌పే లేదా ఫోన్‌పే
ద్వారా రూ.1,000/- (వెయ్యి రూపాయలు)
పంపించి పొందవచ్చును.
వాట్సాప్ ద్వారా మీ ఫోన్ నెంబరు,
చిరునామా తెలియజేస్తే..
కొరియర్ / ర్యాపిడో ద్వారా మీకు పంపిస్తాం.
- మేనేజర్, సర్కులేషన్



నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని లాయర్ పత్రిక కార్యాలయం నందు కూడా పొందవచ్చును.



24 గంటలు
అత్యవసర సేవలు
GOGAADI
రెండు రాష్ట్రాల మధ్య



75,000 కిలోమీటర్ల పరిధిలో
అత్యవసర సహాయ సేవలు
Download the App Now
Download on the App Store
GET IT ON Google Play
సంప్రదించండి
81 8605 8605


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com